18 . 2. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 254 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## 19న ఢిల్లీకి సిఎం రేవంత్ బృందం

- కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీకి పిలుపు
- కేబినేట్‌లో మార్పులు, చేర్పులుపై ఊహాగానాలు



హైదరాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు : తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ బృందం ఈ నెల 19న ఢిల్లీకి వెళ్లనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణలు,

## గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్




*హైదరాబాద్ అంటే చార్మినార్.. బిర్యానీ.. ఫార్మా.. సాఫ్ట్‌వేర్ అని గుర్తు.. కానీ ఇవాళ గ్లోబల్ మాన్యుఫాక్చర్‌కి కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విద్యాసంస్థలు.. ఇక్కడ ఉన్నాయి.. హైదరాబాద్ క్యాపబుల్ సెంటర్‌గా మారిందన్నారు.హైటెక్స్‌లో బయో ఏషియా 2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ముందస్తు విజన్, పాలసీతో ముందుకు వెళుతున్నామని అన్నారు.*

- నాణ్యమైన విద్యాసంస్థలకు నెలువుగా నగరం
- జీవ విజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు
- రెండేళ్లుగా స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళుతున్నాం
- బయో ఏషియా సదస్సు ప్రారంభంలో సిఎం రేవంత్

హైదరాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు: గత రెండు సంవత్సరా ల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. కొద్ది వారాల క్రితం దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం.. జీనోమ్ వ్యాలీని విస్తరించాం.. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో'ను ప్రారంభించాం.. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేసాం? అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని తెలిపారు. ఇది సాధారణ అభివృద్ధి కాదు.. ఇది దృఢమైన దృష్టి ఫలితమని వెల్లడించారు.



## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

- మార్చి చివరి నాటికి లబ్దిదారుల ఎంపిక
- అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం
- యుద్ధప్రాతిపదికన లబ్దిదారుల ఎంపిక
- ఆర్,ఆర్, ఆర్, ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డ్బుల్ హౌసింగ్ పాలసీ
- నెలాఖులోగా ఇండ్ల స్థలాలు కలిగిన 28వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు
- హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రుల సమీక్ష




## ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్'గా హైదరాబాద్

- లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా 5 లక్షల మందికి ఉద్యోగాలు
- ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా తెలంగాణ
- 'బయో ఏషియా 2026' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి





## లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం

- ఇప్పటికే హైదరాబాద్‌లో ఎన్నో లైఫ్ సైన్సెస్ కంపెనీలు
- బయో ఏషియా సదస్సులో విదేశీ ప్రతినిధులతో సిఎం చర్చలు

హైదరాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు: హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులు, కంపెనీలు పెట్టాలని యోచించే గ్లోబల్ ఇన్వెస్టర్లకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

- వ్యక్తి గురించి తెలుసుకోకుండా మోసపోతే ఎలా
- కేసు విచారణ సందర్భంగా సుప్రీం హితోక్తులు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి17 వెలుతురు: నేటి కాలంలో సోషల్ మీడియా, మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా పరిచయాలు పెరిగి మోసపోతున్న ఘటనలు ఎక్కువవుతున్న

## రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు




- క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలి
- ఫీల్డ్‌కు వెళ్లని అధికారులను తొలగిస్తాం
- నెక్లెస్ రోడ్డులో మల్టీలెవల్ కారు పార్కింగ్
- కొత్త మేయర్లు, మున్సిపల్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ
- మున్సిపల్ శాఖపై సమీక్షలో సిఎం రేవంత్ వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు: రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.పురపాలక శాఖపై మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా

## కృత్రిమ మేధ కళ్లద్దాలు

- ఐఎ అద్దాలతో దర్శనమిచ్చిన ప్రధాని మోడీ

ముంబై,ఫిబ్రవరి17 వెలుతురు:




భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026, సమిట్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ సదస్సు జరుగుతోన్న వేళ మన స్టార్టప్ 'సర్వం ఏఐ' చేసిన ప్రకటన వార్తల్లో నిలిచింది. త్వరలో ఏఐ స్మార్ట్ గ్లాసెస్ తీసుకువస్తామని వెల్లడించింది. ఆ అద్దాలు ధరించిన ప్రధాని మోదీ ఫొటో ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారింది. కాగా...కృత్రిమ మేధ రంగంపై

## తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు

- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు సీఎం కప్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు : తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్ 2025 -26 కు సాంకేతిక హంగులు సమకూర్చి క్రీడాకారులకు ఇష్టమైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్లో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సిఎం కప్





## కఠిన షరతులతో ఐబొమ్మ రవికి బెయిల్

- ఇంటర్నెట్ వాడడానికి నిషేధం
- కోర్టుకు పాస్ పోర్టు సరెండర్
- విదేశాలకు వెళ్లడానికి వీల్లేదు

## కోవూరు సమస్యలు పరిష్కరించండి

- సిఎం చంద్రబాబును కోరిన వేమిరెడ్డి దంపతులు

అమరావతి,ఫిబ్రవరి17 వెలుతురు: కోవూరు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తోడ్పాటు అందించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని



## లాటరీలో తొర్రూరును కొట్టేసిన కాంగ్రెస్

- 7 సీట్లు మాత్రమే గెలిచినా వరించిన విజయం
- ఛైర్మన్‌గా శ్రవణ్ కుమార్ ఎన్నిక
- తొర్రూరు చేజారడంతో ఎర్రబల్లి కన్నీరు

మహబూబాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు: ఉత్కంఠకు తెరదించుతూ తొర్రూరు మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం జరిగిన హోరాహోరీ పోరులో చివరకు అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థిని వరించింది. చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ఇరు వర్గాల బలాబలాలు సమానంగా ఉండటంతో అధికారులు 'లక్కీ డ్రా' పద్ధతిని అనుసరించారు. ఈ డ్రాలో కాంగ్రెస్ అభ్యర్థి, రెండో వార్డు సభ్యుడు శ్రవణ్ కుమార్ విజేతగా నిలిచారు. దీంతో ఎన్నికల అధికారి ఆయన పేరును అధికారికంగా ప్రకటించి పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీని దక్కించుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటుండగా, బీఆర్ఎస్ క్యాంప్‌లో విషాదం నెలకొంది. తొర్రూర్‌లో



## తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

- 72 కిలోల కేక్ కట్ చేసిన పార్టీ నేతలు
- తెలంగాణ ఉద్యమ నేపథ్య పాటలు, డాక్యుమెంటరీ విడుదల
- కెసిఆర్ మళ్లీ సిఎం అవుతారన్న మాజీమంత్రి తలసాని
- ముమ్మాటికీ కెసిఆర్ మాత్రమే తెలంగాణ జాతిపిత అన్న కెటిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు: బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ , యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు. కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు,



## కఠిన షరతులతో ఐబొమ్మ రవికి బెయిల్

**హైదరాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు:**
టాలీవుడ్‌తో పాటు ఇతర చిత్ర పరిశ్రమలను వణికించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' వ్యవస్థాపకుడు రవికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ బెయిల్ సాధారణంగా కాకుండా అత్యంత కఠినమైన నిబంధనలతో కూడి ఉండటం గమనార్హం. గత కొంతకాలంగా సాగుతున్న విచారణ అనంతరం, ఆయనకు ఉపశమనం కలిగిస్తూ బెయిల్ మంజూరు చేస్తూ, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కోర్టు పలు ఆంక్షలు విధించింది.ప్రధానంగా రవి ఇంటర్నెట్ వినియోగంపై కోర్టు పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించింది. ఆయన ఎలాంటి ఇంటర్నెట్ సౌకర్యాన్ని సొంతంగా వాడకూడదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి వస్తే కేవలం పోలీసుల ముందస్తు అనుమతితో మాత్రమే వినియోగించాలని స్పష్టం చేసింది. దీనితో పాటు నిందితుడు దేశం విడిచి వెళ్లకుండా కట్టడి చేస్తూ, ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని ఆదేశించింది. భద్రతా చర్యల్లో భాగంగా రవి తన పాస్‌పోర్ట్‌ను వెంటనే కోర్టులో డిపాజిట్ చేయాలని న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే వాటిని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తూ చిత్ర పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టాన్ని చేకూర్చారనే ఆరోపణలపై రవి అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున, ఆయన మళ్లీ వెబ్‌సైట్ నిర్వహణ లేదా పైరసీ పనులు చేపట్టకుండా ఉండేందుకే కోర్టు ఇంటర్నెట్‌పై ఇటువంటి అరుదైన , కఠినమైన ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

## కోవూరు సమస్యలు పరిష్కరించండి

కోరుతూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.. సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో వారు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కనిగిరి రిజర్వాయర్ పనులను త్వరితగతిన చేపట్టాలని సీఎంను కోరారు. ముదివర్తి – ముదివర్తి పాలెం వరకు కాజ్ వే నిర్మాణ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గంగపట్నం, పల్లిపాలెం గ్రామంలో ఉప్పుటేరు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. బుచ్చిరెడ్డిపాలెం ÷ర్ స్టేషన్‌కు కావాల్సిన అదనపు సిబ్బందిని నియమించాలని సీఎంను కోరారు.

## తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు

ఆప్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోని బాలాదేవి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ క్రీడా రంగానికి పెద్ద పీట వేసే లక్ష్యంతో మట్టిలో మాణిక్యాలను గుర్తించే విధంగా తెలంగాణ క్రీడా శాఖ సీఎం కప్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువకులు, విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా మైదానాలకు తరలి రావాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దాదాపు నాలుగున్నర లక్షల మంది క్రీడాకారులు గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా స్థాయిలో పాల్గొని అందులోంచి 22,000 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు.క్రీడాకారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేసే విధంగా సీఎం కప్ గేమ్స్ పేరిట నీలమణి యాప్ ద్వారా ఏఐ కాల్ సెంటర్ ద్వారా 24 గంటల సమాచారాన్ని క్రీడాకారులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. 44 క్రీడాంశాలు 12 జిల్లాల వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోటీలు విజయవంతం కావాలని ఈ క్రీడలనుంచి మంచి ఛాంపియన్లు వృద్ధిలోకి రావాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు పలువురు పాల్గొన్నారు.

## రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు

పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వర్టైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం అడ్వర్టైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. అనధికార అడ్వర్టైజింగ్ బోర్డులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి దీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ ఉండాలన్నారు. జంక్షన్‌ల వద్ద స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జీహెచ్‌ఎంసీ విభజన విషయంలో తలెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## 19న ఢిల్లీకి సిఎం రేవంత్ బృందం

పార్టీ బలోపేతం , భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ఏఐసీసీ అగ్ర నాయకత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్గంలోని పలువురు కీలక మంత్రులు ఈ పర్యటనలో పాల్గొనబోతున్నారు. వీరితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశంలో భాగస్వామి కానున్నారు. 19వ తేదీ ఉదయం ఢిల్లీకి చేరుకోనున్న వీరు, కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ , కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్రంలో పాలన మొదలై రెండేళ్లు దాటిన క్రమంలో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై నివేదిక ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఈ భేటీ తర్వాత తెలంగాణ క్యాబినెట్‌లో మార్పులు లేదా చేర్పులు ఉండొచ్చనే ఊహాగానాలు కూడా రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి.ఖాళీల భర్తీతో పాటు పలువురి మంత్రి పదవుల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకునే వీలుందని అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా గ్యారెంటీల అమలు తీరుపై అధిష్టానం సమీక్షించనుంది. అలాగే ఇటీవల వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలపైనా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సంతృప్తితో ఉంది. ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీ నిర్మాణం, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం , పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్టానం దిశానిర్దేశర చేయనుంది. అలాగే విపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడం , భవిష్యత్తు ఎన్నికల వ్యూహాల గురించి రాహుల్ గాంధీ స్వయంగా నాయకులకు సూచనలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే 19వ తేదీ ఉదయం తెలంగాణ నేతలతో సమావేశమై, అదే రోజు సాయంత్రం మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో భేటీ కానుంది. రాష్ట్రంలో పార్టీ స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వం , పార్టీ మధ్య సమన్వయాన్ని పెంచడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహానికి ముందు ఏర్పరచుకునే శారీరక సంబంధాల విషయంలో యువత అత్యంత అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ఒక వ్యక్తి గురించి పూర్తిగా తెలియకుండా లైంగిక సంబంధంలోకి వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ధర్మాసనం, పెళ్లికి ముందు ఎవరినీ సులభంగా నమ్మకూడదని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణమైన కేసు వివరాల్లోకి వెళితే.. 2022లో ఒక మ్యాట్రిమోనీ సైట్ ద్వారా ఒక యువతికి ఓ యువకుడు పరిచయమయ్యాడు. తాను పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించి, పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అయితే, సదరు యువకుడికి అప్పటికే రెండు పెళ్లిళ్లు అయ్యాయని బాధితురాలికి ఆలస్యంగా తెలిసింది. దీనిపై ఆమె నిలదీయగా, తమకు సంబంధించిన ప్రైవేట్ వీడియోలను బయటపెడతానని అతడు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతనిపై అత్యాచారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఘాటుగా స్పందించింది. ఒకరి గురించి పూర్తి సమాచారం లేకుండా అంతటి సాన్నిహిత్యం ఏర్పరచుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. పెళ్లి పేరుతో జరిగే ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది.

# గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్

దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయోఏషియా 2026 అని సీఎం తెలిపారు. ఈ సభను చూస్తుంటే నేను గర్వంగా చెప్పగలను.. బయోఏషియా తన పేరును దాటి, బయో-వరల్డ్‌గా మారుతోందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడ హాజరయ్యారు.. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారని తెలిపారు. సైన్స్, ఎఐ బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసినప్పుడు అసాధారణమైన ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న నమ్మకం నాకు ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు ముఖ్యంగా జీవవిజ్ఞాన రంగంపై మా దృష్టిని మీతో పంచుకుంటాను. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం మా లక్ష్యమన్నారు. ప్రస్తుత జీవ విజ్ఞాన ధోరణులను చూస్తే పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమని తెలిపారు. మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ అలాంటి వాతవరణాన్ని కల్పిస్తుంది. దీనికి సమాధానం హైదరాబాదేనని అన్నారు. బల్క్ డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచ స్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. మేము కేవలం భారతదేశంలోనే పోటీ పడటం లేదు, ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నామని తెలిపారు. హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందన్నారు. ఇప్పుడు మనం కలిసి దీన్ని సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదామని చెప్పారు.ఇక్కడ పెట్టుబడులు పెట్టండి,మీ ఉఅఅలను స్థాపించండి, ఆవిష్కరణ కేంద్రాలను నిర్మించండని కోరారు. మాలిక్యూల్స్ , ఔషధాలను డిజైన్ చేయండి , క్లినికల్ అనలిటిక్స్‌ను నడపండి, ఎఐ ఎ÷–లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేయండి, డిజిటల్ తయారీని ముందుకు తీసుకెళ్లండని వెల్లడించారు. మా ప్రభుత్వం, అధికారులు, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయానికి భాగస్వాములుగా ఉంటారని సీఎం రేవంత్ తెలిపారు. మనమంతా కలిసి పనిచేస్తే హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుండి ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా ఎదుగుతుందని తెలిపారు. ప్రపంచానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం.. తెలంగాణ ఎదుగుతోంది.. ఈ ఎదుగుదలలో మీరు భాగస్వాములుకండి.. అని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

### ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్'గా హైదరాబాద్

ఫార్మా రాజధానిగా పేరొందిన హైదరాబాద్ ను 'ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్' గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... కొత్తగా 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ దశాబ్దం చివరి నాటికి ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో రాష్ట్రాన్ని ఒకటిగా నిలిపేందుకే 'తెలంగాణ నెక్స్ట్ – జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026–2030)' రూపొందించామని మంగళవారం హెచ్ఐసీసీ లో నిర్వహించిన 'బయో ఏషియా 2026' సదస్సు ఆయన వివరించారు. ఇప్పటి వరకు లైఫ్ సైన్సెస్ రంగంలో సప్లై కోసం మాత్రమే మన వైపు చూసిన ప్రపంచం ఇప్పుడు ప్రస్తుతం ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం చూస్తోందన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చు కునేలా తెలంగాణను అన్ని రకాలుగా సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఎంఆర్ఎన్ఏ(పఖీఔం), జీన్ ఎడిటింగ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ వంటి అత్యాధునిక రంగాల్లో 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా ఇక్కడి యువతను తయారు చేస్తున్నామన్నారు. గ్లోబల్ హబ్‌ల సరసన నిలిచిన ఏకైక భారతీయ నగరం హైదరాబాద్ అని అన్నారు. అందుకే... కేవలం ఉత్పత్తి చేయడమే కాకుండా, నేటి అవసరాలకు అనుగుణంగా కొత్త ఔషధాలను కనుగొనే కేంద్రంగానూ హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అలాగే... గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్ గానూ మార్చేందుకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, ఆటోమేషన్ ఇన్ బయోలాజిక్స్ మాన్యుఫాక్చరింగ్, డేటా ఆధారిత ప్రెసిషన్ మెడిసిన్ , కంప్యూషనల్ బయాలజీ, బయో మాన్యుఫాక్చరింగ్ 4.నీ తదితర రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

**హైదరాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు:**
హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్దిదారుల ఎంపిక పక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడు తున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్దిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చే?స్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్దిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్ఎన్‌యూ ఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిధిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆ లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. చాలా చోట్ల ఇండ్లు తీసుకొని అక్కడ నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని , అలాగే బోగస్ లబ్దిదారులను కూడా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనర్హుల స్థానంలో రాజకీయాలకు అతీతంగా సమీపంలో ఉన్నఅర్హులైన పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. 2 బిహెచ్‌కే నివాస ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్దిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఓర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ ఆర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

## లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం

పునరుద్ఘాటించారు. హైదరాబాద్ మహానగరంలో ఇప్పటికే ఎన్నో లైఫ్ సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీ(గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్)లను ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. ఇదే విషయమై మరింత లోతుగా దృష్టి సారించడానికి, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఇన్నోవేషన్ సెంటర్‌లను సులభతరం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఫ్యూచర్ సిటీలో జిసిసిల కోసం ఒక ప్రత్యేక జోన్‌ను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బయో ఏషియా సదస్సు-2026 జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్... లైఫ్ సైన్సెస్ రంగంలో గ్లోబల్ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిగ్యూటివ్‌లతో భేటీ అయ్యారు.ఫ్రాన్స్ లో తన ప్రపంచ ప్రధాన కార్యాలయంతో సనోఫీ నుండి విడిపోయిన గ్లోబల్ కన్స్యూమర్ హెల్త్‌కేర్ కంపెనీ అయిన ఒపెల్లా హెల్త్‌కేర్, దాని జిసిసి కార్యకలాపాలను 42,000 చదరపు అడుగుల సౌకర్యంతో విస్తరిస్తోంది. వచ్చే ఏడాదిలోపు 500 ఉద్యోగాలను ఈ కంపెనీలను సృష్టించనుంది. జీఏపీఎఫ్ఏ ఇండోనేషియా విభాగమైన వాక్సిండో యానిమల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్, జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక బీఎస్ఎల్-3 వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం కోళ్లు, పశువులు, స్వైన్. ఆక్వాకల్చర్ కోసం వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేయడంపై దృష్టి పెడుతుంది. ఎఐ, డేటా సైన్స్ కంపెనీగా పేరొందిన ట్రైడెన్స్ ఐఎన్సీ, ఏఐ-ఆధారిత హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ పై కీలక సేవలు అందించిన సంస్థ, తన హైదరాబాద్ కార్యకలాపాలను నిర్వహించాలని ప్రకటించింది. ఈ కేంద్రం సుమారు 18,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండగా, దీనిలో ప్రపంచ స్థాయి కార్యకలాపాలను నిర్వహించ తలపెడుతున్నది. దీంతో ఏఐ ఆధారిత హెల్త్ కేర్ రంగంలో మరింత అత్యాధునికత రానుంది. భారతదేశ లైఫ్ సైన్సెస్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆర్ఎక్స్ ప్రొపె÷-లలెంట్ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో భారీ స్థాయిలో ఫార్మాట్ లైఫ్ సైన్సెస్ క్యాంపస్‌ను అభివృద్ధి చేస్తుంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 12 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న 1 మిలియన్ చదరపు అడుగుల అడ్వాన్స్డ్ ల్యాబ్, మౌలిక సదుపాయాలను కలిగి ఉంటుంది. ఇది రాబోయే ఆరు సంవత్సరాలలో మరింత విస్తృతం కానున్నదని మీటింగులో చర్చకు వచ్చింది.

## లాటరీలో తొర్రూరును
## కొట్టేసిన కాంగ్రెస్

మొత్తం 16 వార్డుల్లో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 గెలుచుకోగా.. ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, ఎంపీ కడియం కావ్యల ఎక్స్‌అఫీషియో ఓట్లతో కాంగ్రెస్ సంఖ్య 9కి పెరిగింది. రెండు పార్టీల బలాలు సమానం కావడంతో అధికారులు లాటరీ ద్వారా ఛైర్మన్‌ను నిర్ణయించారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి శ్రావణ్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎంపీ కడియం కావ్య ఎక్స్‌అఫీషియో ఓటు చెల్లదంటూ బీఆర్ఎస్ శ్రేణులతో ఆందోళనకు దిగిన దయాకర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను నర్సింహులుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు.అయితే, తన రాజకీయ కంచుకోటగా భావించే తొర్రూరు మున్సిపాలిటీ చేజారిపోవడంతో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగానికి లోనై మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్నారు. తొర్రూరులో బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తల కష్టాన్ని తలుచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రాణాలకు తెగించి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నేను ఇప్పుడు ఏం సమాధానం చెప్పాలని అంటూ ఆయన కంటతడి పెట్టారు. నాయకులు కేసీఆర్ అంటే ప్రజల్లో ఎంత అభిమానం ఉన్నా, అధికార పార్టీ సాగిస్తున్న అరాచకాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిని ఎర్రబెల్లి తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసులు కూడా అధికార పార్టీకి తొత్తులుగా మారి పనిచేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే దీనికి ముగింపు పడుతుందని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ సందర్భంగా 'జై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.పదేళ్ల పాలనలో దేశం అబ్బురపడే విధంగా అనేక పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ దక్కుతుందని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నామని దౌర్జన్యాలు చేస్తామంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయలేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించిన, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడిన చెప్పుకోదగ్గ ఫలితాలు కాంగ్రెస్ పార్టీ సాధించలేదని విమర్శించారు. మూడేళ్ళ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత అని అడిగిన సన్నాసికి ఇవన్నీ చెప్తా ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటెర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి ÷ైటెర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతి'గుర్తుపెట్టుకో.. కేసీఆర్ ఎన్నడూ చెప్పుకోలేదు నేను జాతిపితనని. ప్రజలు పిలుచుకున్నారు. ఎవరైతే స్వాతంత్య్రం తెచ్చిండో తమ జాతికి, ఆయనను జాతిపితగా ప్రజలు పిలుచుకుంటున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. పెద్దమనిషి, మా తెలంగాణకు బాపు లాంటి పెద్దమనిషి కాబట్టే ఇవాళ మేము గర్వంగా చెప్తున్నాం సర్వసాధారణంగా ఏ తండ్రి అయినా ఆ కొడుకుకు, ఆ పిల్లలకు హీరోగా ఉంటారు. కానీ నా తండ్రి ఇవాళ తెలంగాణకు హీరో, అది తెలంగాణ జాతికి మొత్తానికి హీరో. ఇది వాస్తవం. కొంతమంది మాట్లాడుతున్నారు ఆనవాళ్లు చెరిపేస్తామని. కేసీఆర్ జన్మదిన సందర్భంగా నేను చెప్తా ఉన్నా తెలంగాణనే కేసీఆర్ ఆనవాళు కదా..! తెలంగాణ రాష్ట్రమే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! దాన్ని ఎట్లా చెరిపేస్తావురా సన్నాసి..? నువ్వు మమ్మల్ని ఎన్ని తిట్టినా, ఎన్ని బూతులు మాట్లాడినా ఒకటి మాత్రం వాస్తవం.. ఆయన ఒక శిఖరం, నువ్వు ఒక శునకం. నీ స్థాయి గదే, నీ బతుకు గదే. అందుకే నీకంటే ఇవాళ తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు తెలుసనన్నారు.

వెలుతురు

# ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న పత్రికలకూ అక్రెడిటేషన్లు ఇవ్వాలి

**- మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**



**హైదరాబాద్, వెలుతురు ఫిబ్రవరి 17:**

కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న,మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర సమాచార, పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులు సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మామిడి సోమయ్య మంత్రితో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో గత పదేండ్లు చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగిందని,ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వంలో న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మీడియా సంస్థలకు ఈ సారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు,చానళ్ళకు మాత్రమే ఇస్తున్నారని, ఎంపానల్ కాని ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అమిగతా పత్రికలకు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇవ్వడం లేదని, ఎంపానల్మెంట్ అనేది కేవలం ప్రభుత్వ అడ్వర్టయిజ్మెంట్లకే అని ఆయన మంత్రికి వివరించారు. ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయాలని,అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, నాయకులు హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో- కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరి ప్రసాద్ తదితరులున్నారు.

# ముగ్గురు ఐఏఎస్ లను పెళ్లి చేసుకున్న ఐఏఎస్ అధికారి

**ఉత్తరప్రదేశ్ వెలుతురు ఫిబ్రవరి 17:**



ఈరోజుల్లో అమ్మాయిలు దొరక్కా ఎంతో మంది అబ్బాయిలు రోడ్డు మీద తిరుగుతున్నారు.వయసు పైబడుతున్నా.. వెంట్రుకలు మెరిసిపోతున్నా పెళ్లి కాని ప్రసాద్‌లు ఇప్పటికీ చాలా మంది ఉన్నారు. కానీ మధ్యప్రదేశ్‌లో మాత్రం ఓ ఐఏఎస్ అధికారి నిత్య పెళ్లి కొడుకులా మారిపోయాడు. ఒక్కటి కాదు. రెండు కాదు. ఏకంగా మూడు పెళ్లిళ్లు చేసుకుని హ్యాట్రిక్ కొట్టేశాడు.ముగ్గురు భార్యలు కూడా కీలకమైన బ్యూరోక్రాట్లు కావడం విశేషం.ఇంతకీ ఆ ఐఏఎస్ అధికారి ఎవరు? ఆయన కథేంటో తెలియాలంటే ఈ వార్త చదవాల్సిందే. అవీ ప్రసాద్.. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాకు చెందినవాడు.ప్రస్తుతం మధ్యప్రదేశ్ ఐఏఎస్ అధికారి.ప్రభుత్వంలో కీలక పొజిషన్‌లో ఉన్నాడు. 2013లో ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్ )కి ఎంపికయ్యాడు.ఈ ఉద్యోగం నచ్చలేదో ఏమో తెలియదు గానీ మళ్లీ 2014లో ఖూాజ పరీక్షలో 13వ ర్యాంకు సాధించి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్ ) లో స్థానం సంపాదించాడు.ఈ క్రమంలో ఢిల్లీలో సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధమవుతున్నప్పుడు రిజు బాఫ్నా అనే అమ్మాయితో పరిచయం ఏర్పడింది. ప్రస్తుతం ఆమె మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.ఆమెతో ఉన్న పరిచయంతో అవీ ప్రసాద్ వివాహం చేసుకున్నాడు.కానీ ఈ పెళ్లి ఎన్నేళ్లు నిలవలేదు. కొన్ని రోజులకే పరస్పరం అంగీకారంతో విడాకులు తీసుకున్నారు. అలా మొదటి వివాహం ముగిసిందో లేదోడ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి మిషా సింగ్‌ను వివాహం చేసుకున్నాడు. దీంతో ఆమె మధ్యప్రదేశ్ కేడర్‌లో చేరింది.ప్రస్తుతం రత్లాం కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుంది. మళ్లీ ఏమైందో.. తెలియదు గానీ నాలుగేళ్ల పాటు బాగానే ఉన్నారు. ఈమెతో కూడా అవీ ప్రసాద్ విడిపోయాడు. ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. ఇద్దరు కలెక్టర్లతో పెటాకులైన తర్వాతైన బుద్ధిగా ఉండాల్సిన అవీ ప్రసాద్ ముచ్చటగా మూడోసారి 2017 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి అంకితా ధాకరే మెడలో కూడా మూడు ముళ్లు వేసేశాడు.ఫిబ్రవరి 11న కునో నేషనల్ పార్క్‌లో ఒక సాధారణ వేడుకలో వివాహం చేసుకున్నారు.ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి.ప్రస్తుతం అంకితా ధాకరే రాష్ట్ర మంత్రిత్వ శాఖలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం పెళ్లికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు రకరకాలుగా స్పందించారు.కొంత మంది వ్యక్తిగతం అనగా.. ఇంకొందరు తప్పుపట్టారు. మరికొందరు ఇదేం పద్ధతి అంటూ నిలదీస్తున్నారు. ఇదిలా ఉంటే మూడవ వివాహం గురించి ఇప్పటి వరకు అవి ప్రసాద్ నుంచి అధికారిక ప్రకటన రాలేదు.సోషల్ మీడియాలో కూడా స్పందించలేదు.ప్రస్తుతం అయితే ఫొటోలు వైరల్ అవుతున్నాయి.ఇక అవి ప్రసాద్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ ఉపాధి హామీ మండలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (CEO)గా పనిచేస్తున్నారు.గతంలో అనేక జిల్లాల్లో కలెక్టర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించాడు.ఈ నిత్య పెళ్లి కొడుకైన ఐఏఎస్ అధికారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

## కృత్రిమ మేధ కళ్లద్దాలు

విస్తృతంగా చర్చించేందుకు, అత్యాధునిక ఆవిష్కరణలపై అవగాహన కల్పించే లక్ష్యంతో భారత్‌లో ఏఐ సమిట్ జరుగుతోంది. ఏఐ ప్రయాణంలో భారత్ ముందు వరుసలో నిలిచిందని, దాని పురోగతి.. లక్ష్యం, బాధ్యతలను ప్రతిబింబిస్తుందని ఇప్పటికే మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. బెంగళూరు కేంద్రంగా 2023లో వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్ ఈ సర్వం ఏఐని స్థాపించారు. గ్లాసెస్ గురించి ప్రత్యూష్ ఒక వీడియోను షేర్ చేశారు. ఆ గ్లాసెస్‌కు 'సర్వం కేజ్' అని పేరుపెట్టారు. ఆ తర్వాత మోదీ ఆ అద్దాలను ధరించిన ఫొటోను షేర్ చేశారు. 'వాటిని ధరించిన మొదటి వ్యక్తి ఎవరో తెలుసా..? ప్రధానమంత్రి' అని ప్రత్యూష్ తన పోస్టులో రాసుకొచ్చారు. అది ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో దిగిన చిత్రంగా తెలుస్తోంది. సర్వం కేజ్ కళ్లద్దాలను భారత్‌లోనే అభివృద్ధి చేశామని కుమార్ వెల్లడించారు. ఇది తొలి స్వదేశీ ఏఐ హార్డ్‌వేర్ అని పేర్కొన్నారు. 'ఇది యూజర్ రియల్ వరల్డ్‌లో చూసేవాటిని గమనిస్తుంది.. అర్థం చేసుకుంటుంది.. ప్రతిస్పందిస్తుంది.. క్యాప్చర్ చేస్తుంది' అని వాటి పనితీరు గురించి వివరించారు. త్వరలో వాటికి చాట్ ఫీచర్‌ను కూడా తీసువస్తామని చెప్పారు. ఏఐ గ్లాసెస్‌ను తమ అవసరాలకు అనుగుణంగా కస్టమైజ్ చేసుకోవచ్చు. మేలో ఈ ప్రొడక్ట్ మార్కెట్‌లోకి రానుంది.ప్రపంచవ్యాప్తంగా ఈ స్మార్ట్ గ్లాసెస్ పై ఆసక్తి పెరుగుతోంది. మెటా ఇప్పటికే 'రేబ్యాన్ మెటా' పేరిట గ్లాసెస్‌ను లాంచ్ చేసింది. 2025లో 7మిలియన్ల గ్లాసెస్‌ను విక్రయించింది. త్వరలో యాపిల్ సంస్థ కూడా ఈ తరహా గ్లాసెస్‌ను తీసుకురానుంది. భారత వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఏఐ నమూనాలపై పనిచేస్తోన్న సంస్థల్లో సర్వం కూడా ఒకటి. ఈ సంస్థ ఇప్పటికే సర్వం అక్షర్ , సర్వం స్టూడియో సారస్ వీ3 ని తీసుకువచ్చింది.

# గ్లోబల్ టెక్ - బయో హబ్ గా తెలంగాణ



**దూడం సంతోష్**
**సామాజిక విశ్లేషకులు**

**గ్లోబల్ టెక్-బయో రంగంలో తెలంగాణను పవర్‌హౌస్‌గా తీర్చిదిద్దేందుకు తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం విస్తృతంగా కృషి చేస్తున్నది. అందులో భాగంగా బయో ఏషియా 2026 సదస్సును తెలంగాణ సర్కారు హైదరాబాదులో ఫిబ్రవరి 17, 18 హెచ్ఐసీసీలో రెండు రోజుల పాటు తేదీల్లో నిర్వహిస్తున్నది. ప్రధానంగా హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలపై ఫోకస్ చేస్తుండగా, సుమారు 50 దేశాల నుంచి మూడు వేల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద గ్లోబల్లై ఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ సదస్సుగా బయో ఏషియా సదస్సుకి ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఈ సదస్సును తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సంయుక్తంగా కలిసి ప్రారంభిస్తారు. "టెక్‌బయో అన్‌లీష్డ్: ఏఐ, ఆటోమేషన్ - బయాలజీ రివల్యూషన్" అనే థీమ్ మీద సదస్సు నిర్వహిస్తున్నారు.**

గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు రాష్ట్రాన్ని వేదిక చేసేందుకు హైదరాబాద్ లో ప్రజా ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా బయో ఏషియా సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా బయోటెక్నాలజీ, ఔషధాలు, హెల్త్ రంగాలకు చెందిన నిపుణులు ఈ బయో ఏషియా సదస్సులో పాల్గొంటారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సీఈఓలు, ప్రతినిధులు సంబంధిత రంగాల్లో నిపుణులు, ఆవిష్కర్తలు ఈ వేదికపై జరిగే చర్చలు, సమావేశాల్లో పాలుపంచుకుంటారు. లైఫ్ సైన్సెస్ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు, శాస్త్ర పురోగతి, ఏఐ ప్రభావం ఈ సదస్సులో చర్చించనున్నారు. హెల్త్ కేర్ రంగంలో ఏఐతో వచ్చిన మార్పులు, లైఫ్ సైన్సెస్ భవిష్యత్తును నిర్దేశించే కొత్త ఆవిష్కరణలు, గ్లోబల్ బయో ఎకానమీని బలోపేతం చేయడం, ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ మోడల్స్ తదితర అంశాలను ఎజెండా అంశాలుగా ప్రతినిధులు లోతుగా చర్చ చేస్తారు. బయో రంగంలో కొత్త ఆవిష్కరణలు, దేశ విదేశాల సహకారాలు, హెల్త్ కేర్ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఈ సదస్సు ప్రధానంగా తెలంగాణకు ఉపయోగపడనుంది. బయో ఫార్మాస్యూటికల్స్, డిజిటల్ హెల్త్, వైద్య పరికరాలు, అధునాతన చికిత్స విధానాలు, అత్యాధునిక వైద్యం, ఆరోగ్య సంరక్షణ విధానాలపై ఈ సదస్సులో పాల్గొనే ప్రతినిధులు చర్చించి ముందుకు ఎలా వెళ్ళాలో సమాలోచనలు జరపనున్నారు. ఆయా రంగాల్లో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ఔత్సాహిక సంస్థలు, నిపుణులను ప్రోత్సహిస్తుంది. ప్రపంచస్థాయిలో హెల్త్ కేర్ హబ్, ఇన్నోవేషన్ హబ్ గా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. వైద్య పరిశోధనలు, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్‌లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో బయో ఏషియా 2026 సదస్సు లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగంలో మరో మైలురాయిగా నిలువనుంది. పరిశ్రమల వృద్ధి, సహకారం, అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు బయో ఏషియా సదస్సు సరికొత్త మార్గదర్శనం అందించనుంది. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పెట్టుబడులకు కీలక గమ్యస్థానంగా తెలంగాణ అందరి దృష్టిని ఇప్పటికే ఆకర్షించింది. ఆధునిక సాంకేతికత వ్యవస్థ హెల్త్ ఇండస్ట్రీలో ఎటువంటి మార్పులు తీసుకువస్తుందనే అంశంపై కీలక చర్చలు ఈ సదస్సులో జరగనున్నాయి. అమ్జెన్, సానోఫీ, ఎలీ లిల్లీ, మిల్టెనీ బయోటెక్ వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. బయోటెక్నాలజీ, ఔషధాలు, ఆరోగ్య సేవలు, మెడికల్ టెక్నాలజీ, అర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వంటి రంగాల మీద కీలకోపన్యాసం చేయనున్నారు. ఈ సదస్సులో అమెరికాలోని యూనివర్సిటీ




ఆఫ్ పెన్సిల్వేనియాకు చెందిన క్యాన్సర్ జీన్ థెరపీ నిపుణులు ప్రొఫెసర్ బ్రూస్ ఎల్. లెవిన్, అమ్జెన్ సంస్థ సీఎస్‌వో డా. హోవర్డ్ వై. చాంగ్, జర్మనీకి చెందిన మిల్టెనీ బయోటెక్ వ్యవస్థాపకులు డా. స్టెఫాన్ మిల్టెనీ, సానోఫీ సంస్థ ఈవీపీ మాడలీన్ రోచ్ వంటి ప్రముఖులు కీలకంగా మాట్లాడనున్నారు. అయితే, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్విని వైష్ణవ్ కూడా హాజరవుతారు. భారత ప్రభుత్వ ప్రధాన సలహాదారు(సైన్స్) ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా డా. రాజీవ్ సింగ్ రఘువంశీ ఈ బయో ఆసియాలో ప్రసంగించనున్నారు. "ఫార్మా - బయోటెక్ భవిష్యత్తు" అంశంపై ఒక ప్రత్యేక సీఈఓ కాన్‌క్లేవ్ నిర్వహించనుండగా, అందులో డాక్టర్ రెడ్డీస్, జైడస్, బయోకాన్, సిప్లా వంటి భారతీయ ప్రముఖ సంస్థల సీఈఓలు పాల్గొని ముఖ్యమైన ప్రసంగం చేస్తారు. అలాగే నోవార్టిస్, రోష్, నోవో నార్డిస్క్, మెడ్ట్రానిక్, మెర్క్, ఆస్ట్రాజెనెకా వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ప్యానల్ చర్చలు విస్తృతంగా జరుగుతాయి. కాగా, ఈ చర్చల్లో ప్రధానంగా కొత్త తరహా బయోలాజిక్ ఔషధాలు, సెల్ & జీన్ థెరపీలు, ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ వంటి అంశాలపై సమాలోచనలు సైతం చేస్తారు. ముఖ్యంగా జీవశాస్త్ర సామర్థ్యం ఏఐ ఆధారితశీగా వినూత్నంగా నిర్ణయం తీసుకోవడం, క్లినికల్, వాణిజ్య ఆవిష్కరణ అమలు వంటి అంశాలు ఎలా పురోగమిస్తాయో ఈ బయో ఏషియా సదస్సులో జరిగే వ్యూహాత్మక చర్చలు జరపనున్నారు. దీర్ఘకాలిక రోగాల చికిత్సా పద్ధతులు, ఏఐ-ఆధారిత ఔషధ ఆవిష్కరణ, ఆటోమేషన్, బయోమాన్యుఫ్యాక్చరింగ్ లపై ప్రధానంగా గ్లోబల్ సెషన్‌లలో చర్చించి, ఈ బయో టెక్ అంశాలను వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేయనున్నారు. బయో ఏషియా 2026 కార్యాచరణను అమలు చేసేందుకు మరిన్ని విభిన్న వర్గాలతో భాగస్వామ్యం కలిపి ఎందుకు ఆర్ అండ్ డీ ద్వారా ప్రత్యేకంగా చర్యలు తీసుకోనున్నారో తెలియపరుస్తారు. 2026లో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు నాయకత్వంలో తెలంగాణ నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీని మరింత విస్తృతం చేసింది. దాంతో రాష్ట్రాన్ని ప్రపంచంలోని ప్రముఖ లైఫ్ సైన్సెస్ క్లస్టర్‌లలో ఒకటిగా నిలిపింది. ఈ చర్యల వల్ల తెలంగాణలో ప్రపంచ పెట్టుబడి అనుకూల పరిస్థితులను సృష్టించింది. ప్రపంచ పెట్టుబడుల అవసరాలకు తగిన విధంగా తెలంగాణను తీర్చిదిద్దనున్నారు. తెలంగాణలో ఔషధాలు, వ్యాక్సిన్ల తయారీ స్థావరం నుండి బలమైన పరిశోధన-అభివృద్ధి సామర్థ్యాలు, టెక్‌బయో ద్వారా వైవిధ్యభరితమైన, ఆవిష్కరణ-ఆధారిత బయోఎకానమీగా రాష్ట్రం అభివృద్ధి చేయడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడనున్నది. తెలంగాణ నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ ద్వారా బయోఏషియా సదస్సుతో ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ ఆవిష్కరణలకు ప్రముఖ కేంద్రంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తోంది. అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నిరంతర కృషి చేస్తున్నారు. వారి కృషికి అండగా నిలిచి... అభినందించాల్సిన ఆవశ్యకత మన అందరిపై ఉన్నది.




# త్యాగనిరతికి నిలువెత్తు ఆకృతి

- **శరవేగంగా పొట్టిశ్రీరాములు విగ్రహ నిర్మాణం.**
- **రాజధానిలోని శాఖమూరు వద్ద 6.8 ఎకరాల్లో స్మృతివనం.**
- **58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహం**
- **రూ.150 కోట్లతో అభివృద్ధి.. మార్చి 16న ఆవిష్కరణ.**
- **శరవేగంగా పొట్టిశ్రీరాములు విగ్రహ నిర్మాణం**
- **రాజధానిలోని శాఖమూరు వద్ద 6.8 ఎకరాల్లో స్మృతివనం**

**అమరావతి వెలుతురు ఫిబ్రవరి 17:**

రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన ఆ మహనీయుడి త్యాగనిరతిని భావితరాలకు తెలియజేసేందుకు శాఖమూరు వద్ద 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో ఆయన విగ్రహాన్ని ప్రభుత్వం నిర్మిస్తోంది. పొట్టిశ్రీరాములు 125వ జయంత్యుత్సవాల ముగింపు సందర్భంగా వచ్చేనెల 16న దీన్ని ఆవిష్కరించనున్నారు. ఆయన 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసినందుకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహం రూపుదిద్దుకుంటోంది. మార్చి 16న పొట్టి శ్రీరాములు జయంతిని, డిసెంబరు 15న ఆత్మార్పణ దినాన్ని ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర కార్యక్రమాలుగా ప్రకటించింది.


### ట్రస్టు ఆధ్వర్యంలో పనులు

పొట్టిశ్రీరాములు విగ్రహం, స్మృతివనం నిర్మాణానికి ప్రభుత్వం రాజధానిలో 6.8 ఎకరాల భూమి కేటాయించింది. ఈ ప్రాజెక్టుకు రూ.150 కోట్లు వ్యయమవుతుండగా.. అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ భరిస్తోంది. ఇ-9, ఎన్-15 రహదారుల పక్కన పశ్చిమాభిముఖంగా ప్రతిష్ఠించే ఈ విగ్రహ నిర్మాణానికి మంత్రి లోకేశ్ 2025 సెప్టెంబరు 3న శంకుస్థాపన చేశారు. అక్టోబరులో పనులు ప్రారంభించారు. కృష్ణా జిల్లా బొమ్మలూరుకు చెందిన కళాకారులు అక్కడే విగ్రహ భాగాలకు ఆకృతినిస్తూ, దశల వారీగా రాజధానికి తరలిస్తున్నారు. ఇప్పటికే రెండు భాగాలు చేరుకున్నాయి.

### మొత్తం 110 అడుగుల ఎత్తు

రెండంతస్తుల వేదికపై విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. వేదిక, విగ్రహం కలిపి మొత్తం ఎత్తు 110 అడుగులు. వేదిక నిర్మిత ప్రాంతం 17 వేల చదరపు అడుగులు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 100 మంది కూర్చునేలా మినీ థియేటర్, మ్యూజియం, లైబ్రరీ ఉంటాయి.

మినీ థియేటర్‌లో పొట్టిశ్రీరాములు జీవిత విశేషాలతో కూడిన 15 నిమిషాల



వీడియోను సందర్శకులకు ప్రదర్శిస్తారు.

ఆయన వాడిన వస్తువులు, ప్రముఖులకు రాసిన లేఖలను మ్యూజియంలో ఉంచుతారు.

మొదటి అంతస్తులో ధ్యాన మందిరం ఉంటుంది. 9 అడుగుల ఎత్తైన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అక్కడ ఆసీనులైన భంగిమలో నిర్మిస్తున్నారు.

ధ్యానమందిరంపై కమలం ఆకారంలో పీఠం నిర్మించి, దానిపై విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. పైనుంచి చూస్తే కమలం మధ్యలో మనిషి నిలబడ్డట్టుగా కనిపిస్తుంది.

ఎనిమిది కమలం రేకులు (పెటల్స్) అమరుస్తున్నారు. ఒక్కో రేకు ఎత్తు 22.50 అడుగులు. వాటిని ముంబయిలో తయారు చేయించారు.

మొత్తం బరువు 100 టన్నులు కాగా, విగ్రహాన్ని 30 టన్నుల కంచుతో తయారు చేస్తున్నారు. పీఠంపై విగ్రహాన్ని నిలబెట్టేందుకు లోపల 70 టన్నుల బరువైన ఇనుప గడ్డర్లు వాడుతున్నారు.

మొదటి దశలో భాగంగా మార్చి 16 నాటికి రెండంతస్తుల వేదిక, విగ్రహం సిద్ధం చేసి, విగ్రహావిష్కరణ చేస్తారు.

రెండో దశలో మరో 2,000 సీటింగ్ సామర్థ్యంతో ఆడిటోరియం, పార్క్ అభివృద్ధి చేస్తారు. దీనికి ఏడాది సమయం పడుతుంది.

### ఏటా వెయ్యి మందికి సహాయం

పొట్టిశ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం ఆయన విగ్రహ ఏర్పాటు, నిర్వహణకే పరిమితం కాకుండా.. పలు సేవా కార్యక్రమాలూ నిర్వహిస్తుందని మేనేజింగ్ ట్రస్టీ దూండీ రాకేశ్ తెలిపారు. ప్రాథమికంగా ప్రతి సంవత్సరం వెయ్యి మందికి విద్య, వైద్య సహాయం, పేదరికంలో ఉన్నవారికి చేయూత వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఆ సంఖ్య పెంచుతామన్నారు. 20 కోర్సులతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పి, పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని, భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు జీఎంఆర్ సంస్థ ఆసక్తిగా ఉందని రాకేశ్ పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పేదలకు ట్రస్ట్ తరఫున సాయమందిస్తామని, పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని నందనవనంలా తీర్చిదిద్దుతామని తెలిపారు

# సంపాదకీయం..

# వన్యప్రాణులను కాపాడుకుందాం !



ఇటీవల పెద్దపులుల జనావాసాల్లోకి వచ్చి హడలెత్తించాయి. అడపాదడపా చిరుతలు వస్తూనే ఉన్నాయి. అక్కడక్కడా ఎలుగుబంట్లు దాడి చేస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో అడవిపందులు, జింకలు పంటలపై దాడులు చేస్తున్నాయి. ఏనుగులు కూడా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇకపోతే కోతుల దాడికి హద్దే లేకుండా పోయింది. ఇలా ఇవన్నీ జనావాసాల్లో ఎందుకు వస్తున్నాయో జనాలు ఆలోచించడంలేదు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇవన్నీ ఇలా జనావాసాల మీద పడడానికి కారణం మనమే. అడవులను, కొండలను ధ్వంసం చేసిన పాపానికి భయాన్ని అనుభవిస్తున్నాం. ఇప్పటికీ ఈ విధ్వంసం ఆగడం లేదు. ఆపాలన్న ఆలోచన రావడం లేదు. మనమే ప్రకృతిని ఇలా విధ్వంసం చేస్తూ పోతే ఇకముందు తరాలు ఇంతకు మించి దారుణాలు ఎదుర్కోక తప్పదు. వానరాలు ఊళ్లమీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సంచరించే పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు ఇవాళ మన గడప వరకూ వచ్చేస్తున్నాయి. వన్య ప్రాణులు అడవి దాటి, జనారణ్యంలోకి రావడానికి ప్రధాన కారణం? మనం అడవిగా భావిస్తున్న ప్రాంతంలో అవి జీవించలేకపోవడం. వాటికి కావాల్సిన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అవి బిక్కుబిక్కుమంటూ రోడ్ల మీదకు రావు. మనిషిలోని నాగరిక లాభాపేక్ష వృక్ష, జంతు, పక్షి జాతుల క్షీణతకు దారితీస్తోంది. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం. కానీ, భారతదేశంలో జనాభా విస్ఫోటనం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధి వంటి కార్యకలాపాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పర్యావరణ సమతుల్యత లోపిస్తోంది. వన్య మృగాలను చూసినప్పుడు, వాటిని హింసించకుండా అధికారులకు తెలియజేసే ప్రయత్నాలు రావాలి. గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నడపాలి. సంబంధిత ప్రభుత్వ శాఖలు సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోవడం, ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటూనే, హింసకు దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించడం అత్యవసరం. కేరళలో 'వన్యమృగ బీటర్లు' వంటి స్వచ్ఛంద సంఘాలు వన్య మృగాలను పట్టి, అడవుల్లో విడిచిపెడతారు. అలాగే, సోలార్ ఫెన్సింగ్, బయోఫెన్సింగ్ వాడుతారు. వన్యప్రాణులను మన 'అతిథులు'గా చూడాలి. వాటిని తిరిగి అడవిలోకి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అడవుల పునరుద్ధరణకు పూనుకోవాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలి. మనిషిని, వన్యమృగాన్ని రక్షించే ఏకైక మార్గం?అడవులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న సంగతి గుర్తించాలి. అడవులను నరికివేయడం,ఖనిజాల వెలికితీత పేరుతో కొండలను ధ్వంసం చేయడం వల్ల జరుగుతున్న దుష్పరిణామం ఇది. సహజవనరులను దోచుకోవడానికి అటవీ భూములను కట్టబెట్టడం, అభివృద్ధి పేరుతో ప్రకృతి సిద్ధమైన సహజ ఆవాసాలను, టూరిజం పేరుతో కొండలు, గుట్టలను ఛిద్రం చేయడం వంటి దుశ్చర్యల ఫలితమే ఈ ఫలితం అని గుర్తించాలి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని అటవీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం వన్యమృగాల దూకుడు మాత్రమే కాదు, మనిషి దుందుడుకు చర్యలకు ప్రతిస్పందన కూడా! అ వన్యప్రాణుల వలసకు మూల కారణం మానవాభివృద్ధి తెచ్చిన దురాశ. దేశంలో 1951లో 40.4 శాతం అటవీప్రాంతం ఉండగా, ఇప్పుడది 21.7 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులు, మైనింగ్, రోడ్లు, రియల్ ఎస్టేట్‌లు సహజ అడవులను మింగేస్తున్నాయి. దాదాపు 70 శాతం మంది భారతీయులు అడవులకు సమీపంలోనే నివసిస్తున్నారు. మనిషి- వన్యప్రాణుల సంఘర్షణ వల్ల ప్రతి సంవత్సరం **500** మందికి పైగా మరణిస్తున్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇది వందలాది వన్యమగాల మరణాలకూ కారణమౌతోంది. 'భూమి మనందరి ఆస్తి కాదు'. కానీ మనం అడవులను సొంత 'ఆస్తి'గా భావిస్తూ విధ్వంసానికి పాల్పడుతుండటం వల్లే ప్రకృతి తిరుగుబాటు చేస్తోంది. ఇటీవల తెలంగాణ,తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు కొన్ని రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసిందో పెద్దపులి. ఎట్టకేలకు అటవీశాఖ సిబ్బంది దానికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. తెలంగాణలోని జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలోనూ పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఇళ్లలోకి, పంట పొలాల్లోకి పులి తదితర జంతుజాలం వచ్చేస్తున్నాయి. ఏనుగులు సైతం పంట పొలాల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. నెమళ్లు వంటి అరుదైన పక్షులకూ భద్రత లేకుండాపోయింది. ఇది సహజ పర్యావరణ వ్యవస్థలను భంగపరచడంతో పాటు, జీవవైవిధ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఒక చెట్టు పడిపోతే పది చెట్లను నాటడం అలవాటు చేయాలి. ఇప్పుడు దేశానికి కావాల్సింది అటవీ సంరక్షణ, ప్రకృతి విధ్వంసం ఆపడం. అడవుల నరికివేతను అరికట్టాలన్న దృఢనిర్ణయం, మానవుల నుంచి రక్షణ కల్పించడం అన్నది ఉద్యమంగా సాగాలి. ప్రకృతి మనకు ఇచ్చిన బహుమతి అడవి. మనం దాన్ని కాపాడుకోవడం ద్వారా మనలను మనం రక్షించుకోవాలి. ప్రకృతిపై మనిషికి అధికారం లేదు. బాధ్యత మాత్రమే వుంది అన్న విషయాన్ని గుర్తించాలి. అప్పుడే వన్యప్రాణులకు రక్షణ ఉంటుంది.

## మేకలపై చిరుత దాడి



**అనంతపురం,ఫిబ్రవరి 17( వెలుతురు):**
గుడిబండ మండలంలోని చిగతుర్పి గ్రామంలో లింగప్పకు చెందిన రెండు మేకలు చిరుతదాడిలో మృతిచెందాయి. బాధితుడు లింగప్ప ఇంటివద్ద కట్టేసిన మేకలపై ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి చంపింది. దీంతో రూ.20వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఫారెస్ట్ అధికారులు గ్రామానికి చేరుకుని మేకల కళేబరాలను పరిశీలించారు. అనంతరం పశువైద్యాధికారులతో పోస్ట్‌మార్టం నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## జగన్ అక్రమాస్తుల కేసు

### - ఐఎఎస్ శ్రీలక్ష్మికి దక్కని ఊరట



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 17( వెలుతురు):**
వైసిపి అధినేత వైఎస్.జగన్ అక్రమస్తుల కేసులో ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. జగన్ అక్రమాస్తుల కేసులో తన పేరును తొలగించాలని కోర్టులో దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఈ పిటిషన్ రిజెక్ట్ చేసింది. ఓబులాపురం గనుల కేసులో నిబంధనలకు అనుగుణంగా వెళ్లానని ఐఎఎస్ శ్రీలక్ష్మి సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. అయితే శ్రీలక్ష్మి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని, ఆమె మరిది భారీగా అక్రమాస్తులు సంపాదించారని ధర్మాసనానికి సిబిఐ వెల్లడించింది. ఆమె లంచం కూడా డిమాండ్ చేసినట్టు సాక్ష్యాలు వాంగ్మూలం ఇచ్చారని సుప్రీం ధర్మాసనానికి సిబిఐ అధికారులు తెలిపారు. విచారణ అనంతరం శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 17( వెలుతురు):**
వివాహాది శుభకార్యాల సీజన్ మొదలైన వేళ బంగారం ధరలు స్వల్పంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతో తెలుగు రాష్టాల్లో బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. మంగళవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది. గడచిన రెండు రోజుల్లో రూ.2,840 మేర ధర తగ్గడం విశేషం. ఇక అభరణాల తయారీలో వినియోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గి రూ.1,42,000కు చేరింది. బంగారంతో పాటే వెండి ధర కూడా భారీగా పతనమై కేజీ ధర రూ.2,65,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5 వేల డాలర్ల మార్కు నుంచి 4,930 డాలర్ల స్థాయికి పడిపోవడంతో దేశీయంగా కూడా ధరలు దిగొచ్చాయి. దానికి తోడు డాలర్ విలువలో మార్పులు కూడా బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి.

# ఉద్యమ ఆకాంక్షలను ఎందుకు బిఆర్ఎస్ నెరవేర్చలేకపోయారు..!

*తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న రోజు ఈ నేల గర్వంతో తలెత్తి నిలబడింది. ఆ రోజు తెలంగాణ ప్రజల చరిత్రలో మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్య చరిత్రలో కూడా ఒక కీలక మలుపు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం, ఒక భౌగోళిక విభజన మాత్రమే కాదు, అది ఒక సామాజిక, సాంస్కృతిక, రాజకీయ స్వప్నం. దశాబ్దాల పోరాటం, లక్షలాది ప్రజల త్యాగం, వందలాది మంది యువత ఆత్మబలి దానం , అనేకమంది ఉద్యమకారుల తపన ఇవన్నీ కలసి పుట్టిన ప్రజా రాష్ట్రం తెలంగాణ. కానీ ఈ రోజు ప్రశ్న ఒకటే, ఆ స్వప్నం నెరవేరిందా? ఉద్యమ ఆకాంక్షలు నెరవేరాయా? లేక ప్రజలు మరోసారి చరిత్రలో మోసపోయారా?*



**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

1969లో ఎగసిన తెలంగాణ నినాదం, 2009లో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమ అగ్నిపర్వతం, 2014లో రాష్ట్ర సాధన ఇవన్నీ తెలంగాణ ప్రజల అజేయ సంకల్పానికి నిదర్శనం. గల్లీ నుంచి ఢిల్లీ దాకా సాగిన ఉద్యమం, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, సాగరహారం, రైల్ రోకో, జైల్ బరో ప్రజల ఆగ్రహానికి, ఆశయాలకు ప్రతీకలు. ఈ ఉద్యమం కేవలం ఒక పార్టీ ఉద్యమం కాదు, అది ప్రజల ఉద్యమం, ప్రజల ఆత్మగౌరవం, ప్రజల స్వయం పాలన ఆకాంక్ష.

అయితే, ఉద్యమ పార్టీగా పుట్టిన టీఆర్ఎస్ (తరువాత బీఆర్ఎస్) అధికారంలోకి వచ్చిన తరువాత, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల పాలనగా మార్చడంలో ఘోరంగా విఫలమైంది. 2014లో, 2018లో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసం వినియోగించాల్సిన బాధ్యతను విస్మరించింది. ప్రజల పాలన స్థానంలో కుటుంబ పాలన, ప్రజాస్వామ్యం స్థానంలో నిరంకుశ ధోరణి, సమగ్ర అభివృద్ధి స్థానంలో కార్పొరేట్ దోపిడీ ఇదే తెలంగాణ పాలనకు దురదృష్టకర నమూనాగా మారింది.

నీళ్ళు, నిధులు, నియామకాలు ఈ మూడు నినాదాలు తెలంగాణ ఉద్యమ హృదయం. కానీ నీళ్ళ విషయంలో ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో వేల కోట్ల రూపాయల దోపిడీ, నిధుల విషయంలో అప్పుల ఊబిలో రాష్ట్రాన్ని నెట్టడం, నియామకాల విషయంలో యువతను నిరాశకు గురిచేయడం ఇవే పాలకుల వైఫల్యానికి ప్రతీకలు. ఎత్తిపోతల పథకాల పేరుతో ప్రజల ఖజానాను కాంట్రాక్టర్ల జేబుల్లోకి మళ్లించడం, జల వాటాలపై స్పష్టమైన పోరాటం చేయకపోవడం, కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలం కావడం ఇవన్నీ తెలంగాణ భవిష్యత్తును చీకట్లోకి నెట్టాయి.

ఆర్థిక పరంగా తెలంగాణ రాష్ట్రం ప్రారంభంలో మిగులు బడ్జెట్‌తో ప్రారంభమైంది. కానీ ప్రజానుకూల అభివృద్ధి నమూనా లేకపోవడం వల్ల, అప్పుల ఆధారిత అభివృద్ధి నమూనా అమలులోకి వచ్చింది. నాలుగు లక్షల కోట్లకు పైగా అప్పుల భారం, కార్పొరేషన్ల కౌంటర్ గ్యారంటీలు, ప్రభుత్వ శాఖలకు పెరిగిపోయిన బకాయిలు ఇవన్నీ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం అంచున నిలబెట్టాయి. అభివృద్ధి పేరుతో నిర్మించిన మౌలిక సదుపాయాలు ప్రజలకు ఉపయోగపడిన కంటే, పాలకులకు రాజకీయ లాభంగా మారాయి.

ఎక్సైజ్ ఆదాయం తెలంగాణ ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మారడం, ప్రజలను మద్యం మత్తులో ముంచి పాలన సాగించడం ఇది ఒక సామాజిక దురంతం. 2014లో 2,500 కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయం 2023–24లో 19,500 కోట్లకు చేరడం ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో స్పష్టం చేస్తుంది. ప్రజల వ్యసనాలపై ఆధారపడిన పాలన ప్రజాస్వామ్యానికి శాపం.నిరుద్యోగం తెలంగాణలో ఒక పెద్ద సామాజిక సమస్యగా మారింది. లక్షలాది ప్రభుత్వ పోస్టులు ఖాళీగా ఉన్నా, వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నోటిఫికేషన్లు ఎన్నికల సమయాల్లో మాత్రమే విడుదల చేసి యువతను మోసం చేసింది. పరీక్షలు, వాయిదాలు, కోర్టు కేసులు, ఫలితాల ఆలస్యం ఇవన్నీ యువత జీవితాలను నిలిపేశాయి. నిరుద్యోగ భృతి హామీ మాటలకే పరిమితమైంది. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో వచ్చిన కంపెనీలు స్థానిక యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమయ్యాయి.

వ్యవసాయం తెలంగాణ ఆత్మ. కానీ వ్యవసాయ విధానం శాస్త్రీయంగా రూపకల్పన చేయకపోవడం, కౌలు రైతులను గుర్తించకపోవడం, ఋణమాఫీ అమలు చేయకపోవడం, పంట బీమా నిలిపివేయడం ఇవన్నీ రైతులను అప్పుల కుప్పలోకి నెట్టాయి. రైతు బంధు పథకం భూమి యజమానులకు మాత్రమే పరిమితం కావడం, వ్యవసాయం చేయని భూములకు కూడా నిధులు ఇవ్వడం ఇది వనరుల దుర్వినియోగానికి ఉదాహరణ. ప్రకృతి వైపరీత్యాల పరిహారం అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.గిట్టుబాటు ఇ వ్వాలని రైతుల పోరాటం చేస్తే రైతులకు బీడీలు,ఇక దళితులు, గిరిజనులు, బహుజనులు, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. కానీ దళితుడే ముఖ్యమంత్రి అన్న హామీ రాజకీయ నినాదంగా మిగిలింది. భూమిలేని దళితులకు భూమి పథకం మధ్యలోనే నిలిపివేయడం, గిరిజనులకు అమలు చేయకపోవడం, ఎస్సీ–ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వేరే పనులకు మళ్లించడం ఇది సామాజిక న్యాయంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూపిస్తుంది. దళిత బంధు పథకంలో అవినీతి ఆరోపణలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయి.బీసీలకు ప్రతి సంవత్సరం 5000 కోట్లు మానిఫెస్టోలో కేటాయిస్తామని చెప్పి సమగ్రంగా పది సంవత్సరాల నుండి సగం కూడా ఖర్చు చేయలేదు. ఎంబిసిలకు కేటాయిస్తాం అన్న బడ్జెట్ కూడా సక్రమంగా ఎం బి సీలకు కేటాయింపు జరగలేదు. బిసి సబ్ ప్లాన్ అని చెప్పి బీసీలకు చెవులో పూలు పెట్టారు.విద్య రంగం తెలంగాణ భవిష్యత్తుకు మూలం. కానీ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. బడ్జెట్ కేటాయింపులు తగ్గించబడ్డాయి. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హాస్టల్స్‌లో ఆహార నాణ్యత పడిపోయింది. ఉచిత విద్య హామీ అమలు కాలేదు. విద్య ప్రైవేటీకరణతో పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది.

ఆరోగ్య రంగంలో ప్రభుత్వ ఆసుపత్రులు బలోపేతం కాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల ఆధిపత్యం పెరిగింది. పిహెచ్సీల నుండి రాష్ట్ర స్థాయి ఆసుపత్రుల వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రజలకు వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారింది. ప్రసూతి మరణాలు తగ్గినా, సమగ్ర ప్రజా ఆరోగ్య వ్యవస్థ నిర్మాణం జరగలేదు.

మహిళలపై హింస పెరుగుతున్నా, మహిళా హక్కుల అమలు, సంక్షేమ పథకాల సమీక్ష జరగలేదు. రాజకీయంగా మహిళలకు సముచిత ప్రాతినిధ్యం ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రజాస్వామ్యంలో సగం జనాభాను నిర్లక్ష్యం చేయడం అనేది పాలకుల అశక్తికి నిదర్శనం.

పోలీసు పాలన, ముందస్తు అరెస్టులు, మహిళా ఉద్యమకారి టఫ్,(ఒ.ఖ.ఖీ.) అధ్యక్షురాలు అయిన విమలక్క కార్యాలయంపై తలుపులు బద్దలు కొట్టడం, ప్రజాసంఘాలపై దమనకాండ , ధర్నా చౌక్ బందు, ఇవన్నీ తెలంగాణలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని దెబ్బతీశాయి. ప్రజల ప్రశ్నలను అణచివేయడం, విమర్శలను దేశద్రోహంగా చిత్రీకరించడం, మీడియాను నియంత్రించడం ఇవన్నీ నిరంకుశ పాలన లక్షణాలు. ఉద్యమ పార్టీ ప్రజల ఉద్యమాలను అణచడం చరిత్రలో ఒక విరోధాభాసం.పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగ భృతి, సమగ్ర భూ సర్వే, రెవెన్యూ సంస్కరణలు ఇవన్నీ హామీలుగా మిగిలిపోయాయి. ధరణి పోర్టల్ సమస్యలను పరిష్కరించకపోగా, మరింత సంక్లిష్టం చేసింది. ప్రజల ఆస్తి హక్కులు ప్రమాదంలో పడ్డాయి.

కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణకు రావాల్సిన హక్కులను విస్మరించింది. రాష్ట్ర విభజన హామీలు అమలు కాలేదు. జల వాటాలపై నిర్ణయం తీసుకోలేదు. తెలంగాణ ప్రయోజనాలపై కేంద్రాన్ని ఒత్తిడి చేయడంలో ఆనాటి టిఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కేంద్ర–రాష్ట్ర సంబంధాలు రాజకీయ లెక్కలకే పరిమితమయ్యాయి.

టీఆర్ఎస్ నుండి బీఆర్ఎస్‌గా పేరు మార్చడం, తెలంగాణ పదాన్ని తొలగించడం ఇది ఉద్యమ భావజాలానికి విరుద్ధం. జాతీయ విస్తరణ పేరుతో రాష్ట్ర పాలనను నిర్లక్ష్యం చేయడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశింది. ఉద్యమ పార్టీ ప్రజల పార్టీగా కాకుండా, కుటుంబ రాజకీయ సంస్థగా మారింది.

ఈ పరిస్థితులలో ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయం నిర్మించడం ప్రతిపక్షాల బాధ్యత. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ప్రజల ఆకాంక్షలను అమలు చేయడంలో బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజా ఉద్యమాలు మళ్లీ ఉవ్వెత్తున ఎగసే పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ చరిత్రలో ప్రజలు మౌనంగా ఉన్న సందర్భం లేదు. ప్రజలు ఎప్పుడైనా తాము కోరుకున్న ప్రత్యామ్నాయాన్ని సృష్టించగలరు.

తెలంగాణ స్వప్నం ఇంకా చచ్చిపోలేదు. ప్రజల ఆకాంక్షలు ఇంకా బతికే ఉన్నాయి. నీళ్ళు, నిధులు, నియామకాలు ఈ నినాదాలు ఇప్పటికీ ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి ఇవే తెలంగాణ భవిష్యత్తుకు పునాది. ఉద్యమం సాధించిన రాష్ట్రాన్ని ఉద్యమ స్ఫూర్తితో పాలించకపోతే ప్రజలు మళ్లీ ఉద్యమ మార్గాన్ని ఎంచుకుంటారు. చరిత్రలో ప్రజల సంకల్పాన్ని ఎవ్వరూ ఆపలేరు. అందుకే తెలంగాణ ప్రజల ఆశయాన్ని సంపూర్ణంగా పాలకులు నెరవేరుస్తారని ఆశిద్దాం,లేనియెడల గత ప్రభుత్వానికి పట్టిన గతి కాంగ్రెస్ కూడా ఇదే పరిస్థితి ఏర్పాటు అవుతుందని గుర్తుతెరగాలి.

https://epaper.velthuru.com

## హిమాయత్ నగర్ డివిజన్ లోని పలు ప్రాంతాలకు ట్రాన్స్ఫార్మర్లు మంజూరు...

**- కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్...**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:**
హిమాయత్ నగర్ డివిజన్ లోని బగ్గీ ఖానా లో డ్రైనేజ్ వాటర్ లైన్ తో పాటు ఈ మధ్యకాలంలో రోడ్డు కూడా వేయడానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఒకప్పటి ఇండిపెండెంట్ ఇళ్ల స్థానంలో మల్టీస్టోర్డ్ బిల్డింగ్ రావడం వల్ల కరెంట్ కనెక్షన్ పెరగడం వలన ఉన్న ట్రాన్స్ఫార్మర్ లోడ్ సరిపోవడం లేదు అని బస్తీ ప్రెసిడెంట్ పూర్ణచందర్ హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ దృష్టిలోకి తీసుకురాగా ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి బగీకాన ముత్యాల్ బాగ్ డివిజన్లోని వివిధ ప్రాంతాలలో కొత్త ట్రాన్స్ఫార్మర్లు కావాలని కోరగా ట్రాన్స్ఫార్మర్స్ మంజూరు చేయడం జరిగింది. దానిలో భాగంగా బగ్గీకాణాలు ట్రాన్స్ఫార్మర్ తో పాటు అండర్ గ్రౌండ్ కరెంట్ కేబుల్ లైన్ కావాలని తెలియజేయడం జరిగింది ఇప్పుడు కొత్తగా రోడ్డు పనులు స్టార్ట్ అవ్వబోతున్నాయని ఆ రోడ్డు పనులు చేసే లోపలనే ఈ అండర్ గ్రౌండ్ కేబుల్ కూడా వెళితే కనుక రోడ్డు ఇకమీదట మళ్లీ తవ్వడం జరగకుండా ఉంటుందని ట్రాన్స్ఫార్మర్ తో పాటు అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టం కూడా నేర్పించడానికి ట్రాన్స్ఫార్మర్ ఎక్కడ కూర్చో పెట్టాలో బస్తీ పెద్దలను పిలిచి నిర్ణయం తీసుకోవడం జరిగింది అధికారులు స్పందించి దానిని త్వరలో చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ రాము, బస్ శ్రీనివాసులు కాంగ్రెస్ నాయకులు మహేష్,సందీప్, శేఖర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## మోకిల తాండలో సేవాలాల్ మహారాజు జయంతి వేడుకలు

**- విద్యార్థులకు 100 నోటు పుస్తకాల పంపిణీ**
**- త్వరలో కంప్యూటర్ అందజేత**





**శంకర్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 17 :**
శంకర్ పల్లి మండలం మోకిల తాండలో శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజు 287వ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా తాండకు చెందిన యువజనులు వర్త్య మోహన్ నాయక్, వర్త్య మల్లు నాయక్ గార్లు పాఠశాల విద్యార్థులకు 100 నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "మేము చదువుకున్న మా తాండ పాఠశాలకు మా వంతు బాధ్యతగా విద్యార్థులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. భవిష్యత్తులో కూడా మా తరఫున పాఠశాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం" అని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు కంప్యూటర్ విద్యలో నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు త్వరలో ఒక కంప్యూటర్‌ను కూడా అందజేయనున్నట్లు ప్రకటించారు.

## కెసిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన బోయపల్లి నాగరాజు గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:**
ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బోయపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేసిన తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. బోయపల్లి నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ అనేక త్యాగాలు చేసి, ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి, తన జీవితాన్ని పూర్తిగా తెలంగాణ ప్రజలకు అంకితం చేసిన మహానాయకుడని కొనియాడారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత రైతు, పేద, విద్యార్థి, యువతల సంక్షేమానికి అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకొని తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు కేసీఆర్ అన్నారు. కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వి నాయకులు బి ఆర్ ఎస్ వి రాష్ట్ర ఉపాధ్యక్షులు కడారి స్వామి యాదవ్ శిగ వెంకట్ నేవునూరి ధర్మేందర్ రెడ్డి ఎల్చల దత్తాత్రి పెద్దమ్మ రమేష్ కోనుపురి శశిపాల్ బూరుగు వెంకట్ బల్లెంల అవినాష్ కోదాటి నాగేందర్ మిథున్ ప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు వాలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జనరల్ స్థానాల్లో బీసీలను అధిక శాతం మున్సిపల్ చైర్మన్ లుగా అవకాశం కల్పించినందుకు హర్షం వ్యక్తం చేసిన బీసీ జేఏసీ

**- న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో టీపీసీసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:**
జనరల్ స్థానాల్లో బీసీలకు మున్సిపల్ చైర్మన్ లుగా పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు అవకాశం కల్పించినందుకు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారిని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల కలింగం తెలిపారు.ఈ సందర్భంగా లింగన్ గౌడ్ మాట్లాడుతూ జనరల్ స్థానాల్లో కౌన్సిలర్లుగా మరియు మున్సిపల్ చైర్మన్ లుగా కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించి బీసీలకు పెద్ద ఎత్తున అవకాశం కల్పించిందనీ.ఒకే బలహీన వర్గాలకు చెందిన బిడ్డ మహేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండబట్టే ఇది సాధ్యమైందన్నారు.బీసీల గెలుపు చారిత్రక ఘట్టమన్నారు.బీసీ ఉద్యమాల ఫలితమే ఈరోజు అన్ని పార్టీలు కూడా బీసీలను అక్కున చేర్చు కున్నాయని అన్నారు.60 శాతం పైగా పదవులు బీసీలు దక్కించుకోవడం శుభ పరిణామం అని రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపల్ చైర్మన్ ల గాను బీసీలు 64 మంది మున్సిపల్ చైర్మన్ లుగా గెలిచి చరిత్ర సృష్టించారని అన్నారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో కూడా బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ స్పందిస్తూ కచ్చితంగా బీసీలకు ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల్లో తగిన న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లెపల్లి స్వామి బీసీ విద్యార్థి సంఘం గోదా రవీందర్ నాగేందర్ శ్రీనివాస్ యాదవ్ వెంకటేష్

## హైకోర్టు ఆదేశాల మేరకే హిందీ ప్రచార సభను సీజ్ చేసిన కలెక్టర్ ఆర్డీఓ ఉన్నతాధికారులు

**- నాంపల్లి హిందీ ప్రచార సభలో అవక తవకలు**




**బషీర్ బాగ్ వెలుతురు 17 ఫిబ్రవరి :**
హైకోర్టు జజజూా నెం.227/2016, తేదీ:24-01-2025 లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం, హిందీ ప్రచార్ సభకు చెందిన ఆస్తిని కలెక్టర్,హైద్రాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ నేతృత్వంలో స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లి లో జరిగిన అగ్నిప్రమాదం లో అగ్నికి ఆహుతి అయిన భవనం హిందీప్రచార సభకు చెందిన భూమి హిందీప్రచార సభకు చెందిన ట్రస్ట్ సభ్యులు అక్రమంగా లీజ్ పేరుతో ఆ భూమిని పూర్తిగా అమ్మివేశారు గత నెల 24న జరిగిన అగ్నిప్రమాదంలో 5మంది అమాయక ప్రజలు మరణించడం తో దర్యాప్తు జరపడంతో హిందీప్రచార సభలో జరుగుతున్న అవినీతి అక్రమాల చిట్టను గ్రహించిన అధికారులు ప్రస్తుతం హిందీ ప్రచార సభలో కొనసాగుతున్న ట్రస్టీ ఎంపికకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని తెలుసుకున్న అధికారులు హిందీ ప్రచార సభకు చెందిన భవనంలో కూడా ఎలాంటి ఫైర్ అనుమతులు లేకుండా కొనసాగుతున్న పలు ఫుర్నీచర్ దుఃఖనాలు స్థానిక పోలీసుల తో కలసి హిందీప్రచార సభను సీజ్ చేసిన ఆర్డీఓ మరియు అధికారులు

## మాధవరం రోజా దేవి రంగారావు ఆధ్వర్యంలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు...



**కూకట్ పల్లి ఫిబ్రవరి 17 వెలుతురు:**
శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ లో మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాధవరం కాలనీ లోని డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శిల్పిగా గుర్తింపు పొందిన కేసీఆర్ సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రోజా దేవి రంగారావు మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పట్టుదల, త్యాగం, అంకితభావం చిరస్మరణీయం అన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని రైతులు, మహిళలు, పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. ఆయన చూపిన అభివృద్ధి దిశలోనే మేము కట్టుబడి పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాము" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల పెద్దభాస్కర్ రావు, మాచర్ల భద్రయ్య, ఆంజనేయులు, బాబూరావు, ప్రవీణ్, విక్రమ్, ఈశ్వర్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, రమణ రెడ్డి, రాజు, సిల్వర్ మనీష్, సత్యనారాయణ, బాబు, రామచందర్, సోమయ్య, కొండలరావు, అనిల్, లక్ష్మణ్, నరసింహ రెడ్డి, వాసు, విద్యాసాగర్, రామారావు, జగదీష్, నవీన్, వినయ్, మోహన్ చారి, అనిత, శైలజ, రాధిక, కరుణ, అనురాధ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ వీధి అపార్ట్మెంట్‌లో నాలుగు రోజుల మృతదేహం కలకలం..

**- పోలీసుల జోక్యంతో సమస్యకు పరిష్కారం..**



**కూకట్ పల్లి ఫిబ్రవరి 17 వెలుతురు:**
శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వీధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. సాయి భరద్వాజ్ అపార్ట్మెంట్‌లో మరణించిన శైలజ మృతదేహం నాలుగు రోజుల పాటు అపార్ట్మెంట్‌లోనే ఉండటం స్థానికంగా ఆందోళనకు దారి తీసింది. ఈ విషయం గురించి అపార్ట్మెంట్ వాసి హోటల్ రాజు ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధ్యక్షుడు వెంటనే పోలీసు అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. ఎంతో ఓపిక, సహనంతో మాట్లాడి వారిని ఒప్పించిన అనంతరం మృతదేహాన్ని స్వస్థలం అయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కైకలూరు కు తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రక్రియలో పోలీసు అధికారులు సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పురేందర్ రెడ్డి మాట్లాడుతూ, సమస్య పరిష్కారానికి సహకరించిన పోలీసు, మున్సిపల్ అధికారులు అభినందనలు తెలిపారు. రామకృష్ణ వీధి ప్రజలే మాకు బలం. వారి సహకారంతోనే కాలనీలో ఎలాంటి సమస్యలైనా సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం. కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో కాలనీ అభివృద్ధికి సేవకుడిగా పని చేస్తాను" అని పురేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఘటనతో స్థానికంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితి చివరకు పోలీసుల జోక్యంతో శాంతియుతంగా ముగిసింది.

## సబ్ కలెక్టర్ ఉమా హారతి మర్యాదపూర్వకంగా కలిసిన ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్



**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 17 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన నాగేష్ శెట్కార్ సబ్ కలెక్టర్ ఉమా హారతి గారిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, మున్సిపల్ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్, మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ,స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్-3 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు) కార్యాలయం నూతన భవనంలోకి మార్పు



**బషీర్ బాగ్ వెలుతురు 17 ఫిబ్రవరి :**
సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని అసిస్టెంట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు), సరూర్‌నగర్-3 సర్కిల్ కార్యాలయం నిన్న నూతన ప్రాంగణంలోకి మార్చబడింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు, ఇప్పటివరకు మయూర్ కుశాల్ టవర్స్‌లో ఉన్న ఈ ప్రైవేట్ భవన కార్యాలయాన్ని నాంపల్లిలోని గగన్ విహార్ ఆఫీస్ కాంప్లెక్స్, 2వ అంతస్తులోకి తరలించారు. ఈ నూతన కార్యాలయాన్ని సరూర్‌నగర్ డివిజన్ జాయింట్ కమిషనర్ (రా) శ్రీ పి. నయనార్ గారు రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. నిన్నటి నుండి కార్యాలయ కార్యకలాపాలన్నీ నాంపల్లిలోని గగన్ విహార్ ప్రాంగణం నుండే కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్-3 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ (రా) బి. శ్యామ్ గారు మరియు ఇతర శాఖా సిబ్బంది పాల్గొన్నారు. పన్ను చెల్లింపుదారులు మరియు సంబంధిత వ్యక్తులు ఈ మార్పును గమనించి, ఇకపై పాత భవనానికి కాకుండా నాంపల్లిలోని నూతన కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా కోరడమైనది.

## అమావాస్యనాడు ఆర్యవైశ్య మహిళల అన్నదాన మహోత్సవం



**నాగారం, ఫిబ్రవరి 17 వెలుతురు:**
నాగారం ఆర్యవైశ్య సంఘం మహిళా మణుల ఆధ్వర్యంలో నెంబర్6లో మంగళవారం అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 140 మంది దాతల సహకారంతో ప్రతి నెలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా 1000 నుండి 1100 మందికి స్వచ్ఛమైన ఇంటి వంట అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు.ఈ సందర్భంగా స్థలదాతతో పాటు వాలంటీర్లను అందిస్తున్న సాయి వీరభద్ర ఫర్నిచర్ అధినేత బంగారం వినాయకుమార్‌స్నేహ దంపతులను మహిళా మణులు ప్రత్యేకంగా అభినందించారు. సేవా కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగేందుకు దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండ వెంకన్న, లింగ నాగేందర్, ఉప్పల ప్రసన్న కుమార్, సత్యనారాయణ, లింగ అమరేందర్, పాలవరపు శ్రీనివాస్, గట్టు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ రావునగర్‌లో కేసీఆర్ జన్మదినం సందడి.. తెలంగాణ శిల్పికి ఘన నివాళిగా మారిన వేడుకలు



**ఏఎస్ రావునగర్, ఫిబ్రవరి 17 వెలుతురు ప్రతినిధి నిరంత్:**
కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఏఎస్ రావునగర్ రాధికా చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మాట్లాడిన డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర అపూర్వమని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన దూరదృష్టి నాయకుడిగా ఆయనను కొనియాడారు. సంక్షేమ పథకాల అమలు ద్వారా పేద ప్రజలకు అండగా నిలిచిన మహానేతగా అభివర్ణించారు. భవిష్యత్తులో కూడా ఆయన నాయకత్వంలో తెలంగాణ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పార్టీ సీనియర్ నాయకులు బండారి నీలంరెడ్డి, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, పెద్దాపురం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# పేద కుటుంబానికి యలమందల ఆపన్న హస్తం

- నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, 25కిలోల బియ్యం, 2వేలు నగదు
- పేదలకు యలమందల జగదీష్ సేవలు ఆదర్శప్రాయం



**ఖమ్మం, వెలుతురు ఫిబ్రవరి 17 :**
ఆపదలో ఉన్న ఓ పేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, బియ్యం, ఆర్థిక సాయం అందజేసి మానమత్వాన్ని చాటుకున్న మంచి మనసున్న నాయకులు, నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్. ఖమ్మం అర్బన్ మండలం, కైకొండాయిగూడెం, 1వ డివిజన్ కు చెందిన ఆంగోత్ భద్రు అంధుడు. అతనికి ప్రమాదం జరిగి కాలు ఇంపెక్షన్ తో నడవలేని పరిస్థితిలో కుటుంబ భారంతో ఉన్నాడు. అతనికి ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబం గడవడమే కష్టంగా ఉంది. భద్రు కుటుంబ పరిస్థితిని గమనించిన నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు యలమందల జగదీష్ మానవత్వంతో మంగళవారం ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా నెలకు సరిపోయే నిత్యావసర వస్తువులు, 25కిలోల బియ్యంతో పాటు 2వేల రూపాయల నగదు ఇవ్వడం జరిగింది. పేద కుటుంబాన్ని ఆదుకున్న విషయం గ్రామమంతా చర్చిని అంశంగా మారింది. మానవత్వం ఇంకా బ్రతికే ఉంది. మంచి మనసులు మన మధ్యనే ఉన్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కనీసం బంధువులు కూడా ఇటువంటి సహాయాన్ని అందించరని బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. పేద కుటుంబానికి సాయం అందించిన యలమందల జగదీష్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, లాంబాడీ హక్కుల పోరాట సమితి భద్రు నాయక్, నూర్ భాషా జిల్లా ప్రధాన కార్యదర్శి మీరా, నూర్ భాషా అధికార ప్రతినిధి అన్వర్ పాషా, ఆంగోతు కిషోర్, తేజావత్ రాంకోటి, వీరస్వామి, పుల్లయ్య, శ్రీనివాస్, ఉబ్బనపల్లి రాము, తేజావత్ రమేష్, మహిళలు, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# బి. ఆర్. ఎస్. ఆధ్వర్యంలో కెసిఆర్ జన్మదిన వేడుకలు.



**మోత్కూర్, ఫిబ్రవరి 17,(వెలుతురు న్యూస్ ):**
మోత్కూరు మున్సిపాలిటీ లో దీ=హా పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధ్యక్షులు జంగ శ్రీను మాట్లాడుతు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కలను నిజం చేసిన నాయకుడు కెసిఆర్ అని, తెలంగాణ ను అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపిన మహానేత అని వారు నిండు నూరేళ్ళు జీవించాలని ఆకాంక్షించారు. మండల పార్టీ అధ్యక్షులు పోన్నె బోయిన రమేష్ మాట్లాడుతూ కెసిఆర్ గారి ఆనవాళ్లను తుడిచివేయడం ఎవరి తరం కాదని, కెసిఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని వారు ఇలాంటి పుట్టినరోజులను ఎన్నో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండ శోభ సోంమల్లు, సుల్తాన్ స్వామి, నల్ల మధు మాజీ మార్కెట్ చైర్మన్ తీపిరెడ్డి మేఘారెడ్డి, మునిసిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేశ్,మాజీ సర్పంచ్ బయ్యాని పిచ్చయ్య,మర్రి అనిల్ కుమార్,రాంపాక నాగయ్య,బత్తిని తిరుమలేష్ ,కడమంచి వస్తద్, వార్డ్ అధ్యక్షులు సామ పద్మా రెడ్డి,చేతరాసి వెంకన్న, అన్నందాసు విద్యాసాగర్, బోడ శ్రీను, తాటి లక్ష్మణ్, సుధగాని వెంకన్న,నల్ల ప్రభాకర్, ఐఎవీజ సభ్యులు దాసరి తిరుమలేష్ ,జిల్లా నాయకులు , దబ్బేటి శైలజ, మల్లం అనిత, బుశిపాక గణేష్, కూరెళ్ళ పరమేశ్, పురుగుల మల్లయ్య,కోక బిక్షం,మొరిగాల వెంకన్న, కల్వల శోభన్ బాబు,జిల్లా యువజన నాయకులు,మొరిగాల శ్రీను, సోషల్ మీడియా కన్వీనర్ పొన్నెబోయిన మచ్చగిరి , దాసరి నవీన్ మండల యూత్ అధ్యక్షులు గనగని రాజేష్ బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు పబ్బు ప్రవీణ్ సీనియర్ నాయకులు , దండ్ల కళ్యాణ్,కూరెళ్ల రమేష్,చుక్క అశోక్ దాసరి నరేష్ , పైళ్ల బుచ్చయ్య, వడ్డేపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు

# మోత్కూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న కు సన్మానం





**మోత్కూర్, ఫిబ్రవరి 17,(వెలుతురు న్యూస్):**
మోత్కూర్ లో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఒకటో వార్డు గెలుపొంది మోత్కూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా ఎన్నికైనటువంటి పల్లెర్ల వెంకన్నను శ్రీ సీతారామచంద్ర అభయ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ పూజారి పారునంది సూరిబాబు శర్మ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు దంతూరి కృష్ణ, పోచం కన్నయ్య,బందారపు శేఖర్, పుల్కరం వేణు, రవీందర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, బాలకృష్ణ, సోమిరెడ్డి,దండ కళ్యాణ్, గోపి, శేఖర్,శోభన్, ఫకీరు, నజీర్ తదితర భక్తులు పాల్గొన్నారు

## గౌడ సంఘం ఆధ్వర్యంలో

మోత్కూరు గౌడ సంఘం ఆధ్వర్యంలో పల్లెర్ల వెంకన్న గుప్తాను పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బత్తిని శ్రీనివాస్, బుర్ర కృష్ణ, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బైరగోని ఉపేందర్ , బుర్ర నర్సయ్య బుర్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి..

- కేంద్ర మంత్రి బండి సంజయ్...



**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 17:**
బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల




నిర్మూలనపై అవగాహన కోసం ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు .ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ బాల్యం అమూల్యమైన దశ అని, బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక-మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. పిల్లలు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛందా సంస్థ డైరెక్టర్ రాజ్ కమల్ రెడ్డి కోఆర్డినేటర్ పోలవేణి భూమేష్, భూపాలపల్లి కో ఆర్డినేటర్ తిరుపతి, ఒంటెల కరుణాకర్ రెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ కుమార్ కమ్యూనిటీ మొబిలైజర్లు లత, శ్యామల, లహరి, కోమలత, శ్రీలత, ప్రభా లత తదితరులు పాల్గొన్నారు.

# కారుణ జన్ముడు కేసీఆర్

- పటాన్చెరులో ఘనంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..





**పటాన్చెరు వెలుతురు ఫిబ్రవరి 17:**
తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ శ్రేణులు పటాన్చెరులో ఘనంగా నిర్వహించాయి. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని పంచముఖి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కలను సాకారం చేసిన గొప్ప మహనీయుడు కెసిఆర్ అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

# షబ్బీర్ అలీ .. అవినీతిపరులెవరో తేల్చుకుందాం బయటకురా..!



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు)ఫిబ్రవరి 17**
అవినీతిపరులెవరో తేల్చుకుందామని షబ్బీర్ అలీ బయటకు రావాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. అవినీతిపరులెవరో. నిజాయితీపరులెవరో తేల్చుకుందామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీకి సవాల్ విసిరారు. షబ్బీర్ అలీపై తీవ్ర పరుష పదజాలంతో విమర్శలు చేశారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. 'తనపై అవినీతి ఆరోపణలు చేసిన ముసలి నక్క షబ్బీర్ అలీ' అని వ్యాఖ్యానించారు. షబ్బీర్ వయసుకు గౌరవమిచ్చి ఇన్నాళ్లు ఏమి అనకుండా ఊరుకున్నానని, అనవసరంగా తన జోలికి వస్తే చరిత్ర మొత్తం బయట పెడతానని హెచ్చరించారు. దొంగ కలప, దొంగ సారాయి అమ్ముకున్న చరిత్ర షబ్బీర్ అలీది అని విమర్శించారు. 1989 కంటే ముందు ఆయన ఆస్తులు 1994 వచ్చే సరికి ఎలా పెరిగాయని ప్రశ్నించారు. 1989లో ఊరూరా తిరిగి, ప్రజలకు సేవచేసి గెలవలేదన్నారు. ఆయనకు తొమ్మిది సార్లు అవకాశం ఇస్తే 1989, 2004లో మాత్రమే గెలిచారని ఎద్దేవా చేశారు. 2009లో ఎల్లారెడ్డి వెళ్లి షబ్బీర్ ఓటమి పాలయ్యారని.. మొన్న నిజామాబాద్ వెళ్లి కూడా ఓడిపోయారని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి ఎలక్షన్ అంటే ఖర్చులని, ఆయనకు మాత్రం ఎలక్షన్ అంటే కలెక్షన్ అని ఎద్దేవా చేశారు. ఐదంతస్తుల భవనం అనుమతి లేకుండా కట్టారని, ఫైర్ ఇంజన్ కూడా ఇంటి చుట్టూ తిరిగే పరిస్థితి లేదన్నారు. ఆయనకు హిందీ తప్ప తెలుగు సరిగ్గా రాదని, ఇంగ్లీష్ అయితే అసలే రాదన్నారు. కామారెడ్డికి పట్టిన శని ఆయన అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ టికెట్ విషయంలో డబ్బులు ఎవరిచ్చారో, ఎక్కడిచ్చారో షబ్బీర్ అలీ చెప్పాలని డిమాండ్ చేశారు. తాను నా కుటుంబంతో ఎక్కడికైనా వస్తానని, ఆయన తన భార్య, పిల్లలను తీసుకుని రావాలని సవాల్



చేశారు. నా వైపు తప్పుంటే గుండు గీయించుకుని మీసం లేకుండా.. డిగ్రీ కళాశాలకు సంబంధించి ఒక్క గజం భూమి తాము అమ్ముకున్నామని తేలినా గుండు గీయించుకుని మీసం లేకుండా తిరుగుతానని అన్నారు. అరోరా కాలేజీ దోస్తు ఎవరో.. ధర్నా చేయించింది ఎవరో అందరికీ తెలుసన్నారు. షబ్బీర్ అలీ చేసిన ఆరోపణలపై మసీదు ఎక్కాలన్నారు. కేఆర్ రాజిరెడ్డి భూములు కబ్జాలు చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని విమర్శించారు. నేను ఉన్నంతకాలం నీకు ఆ భూములు ఎలా దక్కుతాయో చూస్తానని సవాల్ చేశారు. కైలాస్ శ్రీనివాస్ నుంచి మొదలుకుని మామిండ్ల లక్ష్మి, పిప్పిరి సుష్మ, గడ్డం ఇందుప్రియ వరకు ఛైర్మన్ పదవులు ఇవ్వడానికి డబ్బులు తీసుకున్న చరిత్ర షబ్బీర్ అలీదని ఆరోపించారు. ప్రస్తుతం ఇప్ప ఉమారాణి బలైందన్నారు. ఛైర్మన్ నిట్టు జాహ్నవిని పదవి నుంచి దింపేందుకు ఏం చేశారో తెలుసన్నారు. షబ్బీర్ అలీకి సరైన మొగుళ్లు అంటే తాను, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావేనని తెలిపారు. "హైదరాబాద్ లో రూ.100 కోట్ల స్కామ్ చేసిన షబ్బీర్ అలీ దొంగల నాయకుడన్నారు. ఇలాంటి దొంగను పక్కన పెట్టుకోవద్దని సీఎం రేవంత్ రెడ్డికి చెప్పినట్టు రమణారెడ్డి గుర్తు చేశారు. తాను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ లాంటి మెతక మనిషిని కాదని, ఎక్కడికి వస్తావో రా.. చూసుకుందామన్నారు. షబ్బీర్ అలీ పీఏగా చెప్పుకొనే షాబాజ్ ఎవరని ప్రశ్నించారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇవ్వడానికి ఎంతెంత తీసుకుంటారో షాబాజ్ ఫోన్ పే చెక్ చేస్తే మొత్తం బయటపడుతుందన్నారు. ఎవరెవరి దగ్గర ఎంత తీసుకున్నారో మొత్తం ఇచ్చేయాలని, లేకపోతే కామారెడ్డిలో మరొక ప్రజా దర్బార్ మొదలవుతుందని హెచ్చరించారు. అమృత్ స్కీం, రైల్వే స్టేషన్ నిధులు కాకుండా తాను కామారెడ్డికి రూ.100 కోట్లు తెచ్చానని, కానీ ఎక్కడ కూడా చెప్పుకోలేదని, చెప్తే అధికారులను ఇబ్బందులకు గురిచేస్తారని ఆగిపోయానన్నారు. ఇందిరాచౌక్ లో ఇందిరాగాంధీ విగ్రహం పెట్టేందుకు కూడా రూ.20 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు.ఇకపై షబ్బీర్ అలీ ఆగడాలు సాగనివ్వను..ఇకపై షబ్బీర్ అలీ ఆగడాలు సాగనివ్వనని, ఆయనకు ఏ అధికారి సపోర్ట్ చేస్తాడో చూస్తానని ఎమ్మెల్యే కేవీఆర్ అన్నారు. అన్ని గ్రామాలకు తిరుగుతానని, ఎవరు అడ్డువస్తారో చూస్తానన్నారు. ఇకనుంచి యుద్ధమేనని ఎంత మందితో వస్తారో చూస్తాన్నారు. షబ్బీర్ అలీ కొడుకు రేప్ కేసు, వాళ్లు చేసే దందాలు, కబ్జాలన్నీ బయటకు తీస్తానని హెచ్చరించారు. తన విషయంలో ఇప్పటిదాకా పోలీసులకు ఎలాంటి పని లేదని, ఇకపై ఉరుకులు పరుగులు పెడతారన్నారు. తనను ప్రజలు విస్మరించిన రోజు ఎన్నికల్లో పోటీ చేయనని స్పష్టం చేశారు."కామారెడ్డిలో దొంగల బ్యాచ్ అంతా కలిసి మున్సిపాలిటీని దక్కించుకున్నారని విమర్శించారు. మున్సిపల్ ఛైర్మన్ విషయంలో తాను బీఆర్ఎస్ వాళ్లను అడగలేదని.. సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారన్నారు. తాను అడిగింది లేనిది ముఖ్య నాయకులకు తెలుసని, దమ్ముంటే మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ముజీబొద్దిన్ ప్రెస్ మీట్ పెట్టి తాను అడగలేదని చెప్పాలన్నారు. కామారెడ్డి అభివృద్ధి జరగాలని, తాను ఒక మెట్టు దిగి ఇద్దరు ఒకటి కాకుండా చూడాలని ప్రయత్నించానని, అయినా ఒక్కటయ్యారన్నారు. తనవల్ల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కంటతడి పెట్టే పరిస్థితి రావద్దన్నారు. అలా జరగకుండా అవినీతి రహిత పాలన అందించాలని ఛైర్మన్, వైస్ ఛైర్మన్లకు సూచించారు. ఇద్దరిపై తనకు నమ్మకం ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆకుల సుజాత భరత్ కుమార్, మోటూరు శ్రీకాంత్, బండారి నరేందర్ రెడ్డి, కుంట లక్ష్మారెడ్డి, ప్రీతి జైన్, కాసర్ల రాణి, భాను ప్రకాష్, రాహుల్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, బిజెపి పార్టీకి చెందిన 16 మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పై కాంగ్రెస్ నాయకుల ప్రెస్ మీట్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు)ఫిబ్రవరి 17**
కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయ సెగలు రాజుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వైఖరిపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. మున్సిపాలిటీ చేజారిందన్న ఫ్రస్టేషన్‌లో ఎమ్మెల్యే ఒక సైకోలా ప్రవర్తిస్తున్నారని, ప్రజాప్రతినిధి హోదాను మరచి వీధి రౌడీలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు, డిసిసి మాజీ అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు పాల్గొని ఎమ్మెల్యేపై సంచలన ఆరోపణలు చేశారు. షబ్బీర్ అలీపై ఆరోపణలు చేస్తే సహించం. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. షబ్బీర్ అలీ వారి కుటుంబ సభ్యులు చట్టబద్ధంగా డబ్బులు చెల్లించి భూములు కొనుగోలు చేశారు తప్ప, ఎవరినీ బెదిరించి కబ్జాలు చేయలేదు.షబ్బీర్ అలీకాలి గోటికి కూడా సరితూగని వ్యక్తివి, నీవు చిల్లర మాటలు మాట్లాడటం మానుకోవాలి. మర్యాద తప్పితే కాంగ్రెస్ కార్యకర్తలు కూడా అదే స్థాయిలో సమాధానం చెప్తారు" అని హెచ్చరించారు. ఎమ్మెల్యే 'కబ్జాల' చిట్టా ఇదే.. (ఆధారాలతో సహా)!

ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి గత చరిత్రను సాక్ష్యాధారాలతో సహా కాంగ్రెస్ నాయకులు ఎండగట్టారు, రిటైర్డ్ ఉద్యోగుల భూమి కబ్జా తన విద్యాసంస్థ పక్కన ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల భూమిని కబ్జా చేసి ప్రహరీ గోడ కట్టారని, కోర్టు ఆర్డర్లను సైతం లెక్కచేయకుండా 30 వేల గజాల భూమిని బెదిరించి 3 వేల గజాలకు తగ్గించలేదా? అని ప్రశ్నించారు. కర్షక్ విద్యాసంస్థల కుంభకోణం: రైతుల బిడ్డల కోసం సేకరించిన 260 ఎకరాల భూమిని అరోరా ఇంజనీరింగ్ కాలేజీకి దారదత్తం చేసి, ఆ భూములను బ్యాంకులో కుదవపెట్టి రూ. 7 కోట్లు తీసుకున్నది వాస్తవం కాదా? అని నిలదీశారు.ఫోర్జరీ సంతకాలపై కోర్టు కేసులు ఉన్న విషయం గుర్తు చేశారు. జపాన్ పర్యటన మిస్టరీ: "మూడు నెలల క్రితం జపాన్ పర్యటన వెనుక అసలు కథ ఏంటి? అక్కడ ఏం చేశావో సెకండ్ ఎపిసోడ్‌లో నీ బండారం బయటపెడతాం" అని హెచ్చరించారు. రోడ్డు నిర్మాణం వెనుక కమీషన్లు: టేకిరియల్ నుండి లింగాపూర్ 100 ఫీట్ల రోడ్డును ఎమ్మెల్యే కాకముందు అడ్డుకున్న వ్యక్తివి, ఇప్పుడు ముందుండి ఎందుకు వేయిస్తున్నావు? అందులో నీకు ఎంత ముట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

### వరుస మోసాలు - బెదిరింపులు

ఎమ్మెల్యే తన సొంత మిత్రులను, వ్యాపార భాగస్వాములను కూడా వదలలేదని నాయకులు ఆరోపించారు . టీవీ కేబుల్ నెట్వర్క్ పేరుతో పార్టీ నాయకులను నట్టేట ముంచారని. అశోక్ నగర్ కాలనీకి చెందిన ఒక అమాయకుడి ఇంటి కాగితాలు బ్యాంకులో పెట్టి రూ. 20 లక్షల అప్పు చేసి, తీర్చలేక పారిపోయారని. అంతంపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 146లో 1 ఎకరం 12 గుంటల భూమిని 'రైస్ పుల్లింగ్' పేరుతో నరసింహారెడ్డి అనే వ్యక్తిని మోసం చేసి కబ్జా చేశారని బాధితులు వాపోతున్నారని తెలిపారు.

### దమ్ముంటే సీఎస్ఐ గ్రౌండ్‌కు రా!

"అధికారులకు నోటితో కాదు చేతితో పని చెప్తా అంటున్నావు.నాపై ప్రెస్ మీట్ పెడితే కొడతా అంటున్నావు.. దమ్ముంటే రా! ఎవరిని కొడతావో, ఎక్కడికి రమ్మంటావో చెప్పు.. మేము సిద్ధం" అంటూ కాంగ్రెస్ శ్రేణులు బహిరంగ సవాల్ విసిరారు.ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోతే ప్రజలే నీ బట్టలు ఊడదీసే రోజు దగ్గరలోనే ఉందని, నిన్ను ఎర్రగడ్డకు తరలించే సమయం ఆసన్నమైందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో వార్డు కౌన్సిలర్లు అంజద్, మాజీద్, లడ్డు, సిద్ధిక్, కళ్లెం సత్యం, యూనిస్, వాజీద్, అనంతరెడ్డి, గంప ప్రసాద్, జమీల్, విద్యార్థి నాయకులు సందీప్, చందు, తుడుము ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## RMP డాక్టర్ చంద్రమౌళి నీ సన్మానించిన ఆర్యవైశ్యులు



**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 17:** నార్కట్ పల్లి పట్టణ కేంద్రంలోని డాక్టర్ చంద్రమౌళి ఆర్.ఎం.పి వైద్య సేవల్లో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన వైద్య సేవలను కొనియాడుతూ సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు బిళ్ళకంటి శ్రీకాంత్, ఆర్యవైశ్య టౌన్ అధ్యక్షుడు పసునూరి శ్రీనివాస్, పాల్వాయి భాస్కరరావు, దోసపాటి విష్ణుమూర్తి, దేవరశెట్టి నారాయణ, పాల్వాయి ప్రసాద్, అర్థం శీను తదితరులు పాల్గొన్నారు.

## సత్యంతండాలో గ్రామపంచాయతీ భవనానికి డ్వాక్రా సంఘం భవనానికి శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ నేనావత్ తుకారాంనాయక్, ఉపసర్పంచ్ కొర్రస్వప్న

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో సత్యంతండాను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాను సర్పంచ్ నేనావత్ తుకారాంనాయక్**





**మంచాల వెలుతురు ఫిబ్రవరి 17:** మంచాల మండలం సత్యంతండాలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో మంజూరైన గ్రామపంచాయతీ భవనానికి డ్వాక్రా సంఘం భవనానికి శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ నేనావత్ తుకారాంనాయక్ ఉపసర్పంచ్ సప్న వార్డుసభ్యులుఈసందర్భంగా గ్రా మ సర్పంచ్ నేనావత్ తుకారాం నాయక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవనానికి20 లక్షలు రూపాయనిధులుమంజూరు డ్వాక్రాసంఘంభవనానికి 10 లక్షలరూపాయల నిధులు మంజూరు అయ్యాయిఅన్నారు ఇబ్రహీంపట్నంఎమ్మెల్యే మల్ రెడ్డిరంగారెడ్డిగారి సహకారంతోసత్యంతండా లోఅన్నిరకాల మౌలిక వసతులు కల్పించి ప్రజలకుఎలాంటి ఇబ్బందులులే కుండాపూర్తి స్థాయిలో అభివృద్ధిచేసి ఒక ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతాను అనిఅన్నారు ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి స్నిగ్ధ వార్డు సభ్యులు మౌనిక గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు

## మంచాల గ్రామంలో 1వవార్డు, 2వవార్డు, 3వవార్డులలో తాగునీరు సక్రమంగా సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు

**- త్రాగుగునీరు సక్రమంగా సరఫరా చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ కు వినతి పత్రం అందజేసిన ప్రజలు**



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 17:** మంచాల మండలం మంచాల గ్రామంలో గత కొన్నిరోజులుగా1వ వార్డు2వవార్డు3వవార్డులో మి షన్ భగీరథత్రాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రజలునాన ఇబ్బందులు ఎదుర్కొం టూ ఆందోళన చెందుతున్నారు త్రాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గ్రా మకార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ కు వార్డుప్రజలు వినతి పత్రంఅందజేశారు ఈసందర్భంగా1వ వార్డు 2వ వార్డు 3వ వార్డు ప్రజలు మాట్లాడుతూఎన్నిసార్లు అధికారులదృష్టికి తీసుకెళ్లిన పట్టించు కో వడంలేదుఇప్పుడే ఇలాఉంటే రాబోయేవేసవికాలంలో ఎలా ఉంటుందో త్రాగునీరువిషయంలో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు వెంటనే ఆఅధికారులు స్పందించి1వవార్డు2వవార్డు 3వ వార్డుకు త్రాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుం డాఅ ధికారులుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారుఈకార్యక్రమంలోమహిళలు ఏరుకొండ ము త్యాలమ్మ ఓరుగంటి శారదమ్మ జ్యోతి అనిత మొగిలి ప్రభావతి పులకంటివిజయ దాచిరెడ్డి అ లివేలు తదితరులుపాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో పూర్ణతిరుపతి రైలు హాల్ట్ కోరుతూ బీజేపీ వినతి



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:** పూర్ణ నుండి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు రైల్వే అధికారులను కలిసి తమ డిమాండ్లను వివరించారు. జహీరాబాద్ పట్టణంతో పాటు పరిసర మండలాల ప్రజలు తిరుపతి, నాందేడ్ ప్రాంతాలకు ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పూర్ణతిరుపతి రైలుకు హాల్ట్ కల్పిస్తే వేలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, భక్తులు ఈ రైలుపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. అలాగే అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.25 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్టేషన్ ఆధునీకరణ పనులను వేగవంతం చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, సుధీర్ భండారి, కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రవణ్, భావన గౌడ్, నాయకులు బక్కాయ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, సోమ అనిల్, రాయపల్లి సునీల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ ఎమ్మెల్యే జిఎంఆర్..

**- ఎమ్మెల్యే జిఎంఆర్ ను అభినందించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్..**

**- తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి**



**పటాన్చెరు వెలుతురు ఫిబ్రవరి 17:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు శ్రీ కేసీఆర్ గారు పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారిని అభినందించారని ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు శ్రీ కేసీఆర్ గారి జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే జిఎంఆర్ గారి ఆదేశాల మేరకు వారి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి బృందం ఎర్రవల్లి లోని కేసీఆర్ ఫామ్ హౌస్ లో కెసిఆర్ గారిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజులు బిఆర్ఎస్ పార్టీయేనని.. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష

**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 17 :** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గంలో రామతీర్థం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ మహాన్వి కంటి దవాఖాన వారి సహకారంతో గ్రామంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించబనది. 72మంది కంటి పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సెక్రటరీ మల్లేష్, ఆప్తమాలిక్ గీత, సాయికుమార్, ప్రశాంత్, తమ సర్పంచ్,ఉపసర్పంచ్ మరియు వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక

**- హైడ్రామా చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక పంచాయితీ హైకోర్టులో చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా**

**- హైకోర్టు తీర్పు ప్రకారం నడుచుకుంటాం ఇబ్రహీంపట్నం ఎన్నికల అధికారి అనంతరెడ్డి**



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యాలయంలోకి వెళుతున్న కాంగ్రెస్ పార్టీ మద్దతు 9మంది కౌన్సిలర్లు



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్తున్న భూపతి మద్దతు15మంది కౌన్సిలర్



కిడ్నాప్ కు గురైన ఆకుల యాదగిరి నేడు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో బీఆర్ఎస్ కండువా కప్పుకొని సభకు హాజరు



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి అనంతరెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 17:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగాఇబ్రహీంపట్నంమున్సిపాలి టీ కార్యాలయనికి వచ్చిన.బిఆర్ఎస్ పార్టీ మద్దతుగా15మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి మద్ద తుగా 9 మంది కౌన్సిలర్లు హాజరైనారు చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక జరపాలంటూ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అధికారులకుచెప్పడంతో హైడ్రామామొదలయ్యింది ఉదయంనుండి హైకోర్టుస్టేఅంటూ చట్టాన్ని తప్పుదారి పట్టించిన అధికారులురంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో 19వ వార్డు నుండి ఎన్నికైన భారతీయరాష్ట్రసమితి కౌన్సిలర్ ఆకుల యాదగిరి కిడ్నాపింగ్ డ్రా మాఆకుల యాదగిరి కుటుంబ సభ్యులు యాదగిరి కనబడుటలేదని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేష న్లోఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన ఆకుల హరికాంత్ అకస్మాత్తుగా 17వతేదీ ఉదయం11 గం టలకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ ఆకులయాదగిరి ప్రత్యక్షం అనం తరం తన నెవ్వరు కిడ్నాప్ చేయలేదని మీడియాకు జైతెలంగాణనినాదం చేస్తూఅనంతరం బిఆ బిర్ఎస్ పార్టీకి మద్దతుపలికి, ప్రమాణస్వీకారంచేసిన ఆకులయాదగిరి ఇదిఇలా ఉండగాహైకో ర్టు లో స్టే ఉందని అది వికెట్ చేయా లనిఎన్నికల అధికారి ఆర్డీవో కనీసం హైకోర్టులో నంబరింగ్ కూ డా కానీ కేసుఉందని చెప్పిఅధికార పార్టీ ఒత్తిడితో చట్ట వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులను ప్రజల ను తప్పుదోవ పట్టించారని తీరస్థాయిలో మాజీ ఎమ్మెల్యేమంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆగ్రహంవ్యక్తం చే శారు కోర్టు స్టే పేరుతోఉదయం11గంటల నుండి సమాజాన్నిమీడియానుప్రజాప్రతిని తప్పుతో ప ట్టించిన ఆర్డిఓ వాళ్లకు సహకరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నాయకు లు ఆగ్రహంవ్యక్తంచేశారుఎన్నికల అధికారి ఇబ్రహీంపట్నంఆర్డిఓ అనంతరెడ్డి,తప్పుడు సమాచా రం ఇచ్చిఇలాంటి హైకోర్టు స్టేలేకుండా నియామక పత్రాలు ఇవ్వకుండాచైర్మన్ చేయకుండా హైడ్రా మా సృష్టించారు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీఎమ్మెల్యే మంచిరె డ్డి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలోఆగ్రహం వ్యక్తం చేశారు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ సుదర్శన్ రెడ్డి ఎన్నిక అయిన తర్వాత హై కోర్టు స్టే ఆర్డర్ వచ్చింది ఎలా చెప్తారు అని బిఆర్ఎస్ కౌన్సిలర్లు అధికారులతో వాగ్వాదం ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మన్ ఎన్నిక పై హైకోర్టు ఇచ్చిన స్టేఆర్డర్ చూపిం చే వ రకు కౌన్సిల్ హాల్ నుండి వెళ్ళమని చెప్పిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్మెన్ గా బీ ఆర్ఎస్ నుంచి సుదర్శన్ రెడ్డి ఎన్నికైన తర్వాత స్టే ఆర్డర్ వచ్చిందని ఎలాచెబుతారంటున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు అధికారులతో హై కోర్టు స్టే ఆర్డర్ చూపించాలని వాగ్వాదానికిదిగారు స్టేఆర్డర్ రావడానికి సా యంత్రం 6 అవుతుందని సమాధానం చెప్పిన అధికారులు అప్పటివరకు కౌన్సిల్ హాల్ లోనే ఉంటామంటున్న కౌన్సిలర్లు ఉదయం11గంటల నుంచి బయటికి రాకుండాకౌన్సిల్ హాల్ లోనే ఉన్నకౌన్సిలర్లుమరోవైపు 19 వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిని18వ తేదీ రోజు ఉదయం హై కోర్టులో హాజరు పర్చాలని పోలీసులకు హైకోర్టుఆదేశాలు ఇపుడు కౌన్సిల్ హాల్ నుంచి ఆకుల యాదగిరి బయటకి వస్తే బీఆర్ఎస్,కాంగ్రెస్ క్యాంపుల్లోకివెళ్లకుండా అతని ఇంటికి తీసుకెళ్తామని చెబుతున్న పోలీసులురేపుఉదయం 10.30 కి హైకోర్టులోఆకుల యాదగిరిని హాజరు పరుస్తామ నిచెబుతున్న పోలీసులు సాయంత్రం 6దాటిన హైకోర్టు ఆర్డర్ కాపీ చూపించని అధికారులు ఎ న్నికలఅధికారి అనంతరెడ్డి మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతూ హై కోర్టు నుండి స్టే రావ డంవల్ల ఎన్నికలప్రక్రియ ఆగిందని,తదుపరి నిర్ణయం హైకోర్టు సూచనల ప్రకారం జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు


# ఇందిరాపార్క్ వద్ద కల్లుగీత కార్మికుల నిరాహార దీక్ష

**- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి**

**- రాష్ట్ర బడ్జెట్ లో గీత కార్మికుల సంక్షేమానికి 5000 కోట్లు కేటాయించాలి**

**- వేలాదిమంది గీత కార్మికులతో దద్దరిల్లిన ఇందిరా పార్క్**





**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:** మంగళవారం రోజున కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గం ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష నిర్వహించింది. దీనికి రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిమంది గీత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ దీక్షను మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతరాములు ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షులు యం.వి. రమణ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో గీత కార్మికులకు ప్రతిసారి అన్యాయమే జరుగుతుందన్నారు. గత సంవత్సరం బడ్జెట్లో 70 కోట్లు మాత్రమే కేటాయించారు అవి కూడా డబ్బులు లేవనే పేరుతో విడుదల చేయలేదు. కేవలం 17 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఈ సంవత్సరం ప్రవేశపెట్టబోయే బడ్జెట్లోనైనా 5 వేల కోట్లు కేటాయించి గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రివర్యులు వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు గీత కార్మికులకు అనేక హామీలు ఇచ్చింది. పెన్షన్ 2 వేల నుండి 4 వేలకు పెంచుతామని,ఎక్స్‌గ్రేషియా 10 లక్షలకు పెంచుతామని అదికూడా నెల రోజుల లోపే ఇస్తామని చెప్పారు.ఇది పెంచకపోగా ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా డబ్బులు కూడా రెండు సంవత్సరాల నుండి ఇవ్వడం లేదన్నారు. 850 మందికి ఇవ్వాల్సిన 14 కోట్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2025 జూలై 14వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు బాధితులతో నిరాహార దీక్షలు చేశాము.2025 నవంబర్ 28వ తేదీన వేలాది మంది గీత కార్మికులతో సూర్యాపేటలో గీతన్నల రణభేరి నిర్వహించాం అయినా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి చేసి హక్కులు సాధించేందుకు రాష్ట్ర కార్యవర్గం హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్షకు పూనుకుందన్నారు. బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ మాట్లాడుతూ హక్కుల కోసం పోరాటం చేయాలని, బీసీలకు రాజ్యాధికారం కై అందరం కలిసికట్టుగా ఉద్యమించాలన్నారు. మాజీ కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయని కల్లబొల్లి కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలించే అర్హత లేదన్నారు. సుప్రజ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శిగ విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నిత్యం చస్తూ బతికే కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇంకా ఈ దీక్ష కార్యక్రమంలో వివిధ గౌడ సంఘాల రాష్ట్ర నాయకులు అయిలి వెంకన్న గౌడ్, అంబాల నారాయణ గౌడ్, ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్, జిక్కే వీరస్వామి గౌడ్, వంగ సదానందం గౌడ్, మల్లేశం గౌడ్, శ్రీకాంత్ గౌడ్, కూరెల్లి వేములయ్య గౌడ్ మరియు వివిధ వృత్తి సామాజిక సంఘాల నాయకులు దుర్గయ్య గౌడ్,, నాగేశ్వరరావు గౌడ్ ఆర్. శ్రీ రామ్ నాయక్, టీ స్కైలాబ్ బాబు, పి.ఆశయ్య, లెల్లెల బాలకృష్ణ, ఉడుత రవీందర్, జి నాగరాజు తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ దీక్షలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, బొలగాని జయరాములు, గౌని వెంకన్న, బాల్నే వెంకట మల్లయ్య, గౌని సాంబయ్య, రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు, ఎస్ రమేష్ గౌడ్, ఎస్ వెంకట్ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, రాగీరు కృష్ణయ్య, కొండం కరుణాకర్, మెరుగు వీరస్వామి,యమ గాని వెంకన్న, గౌరవ సలహాదారు భీమగోని చంద్రయ్య మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 105 మంది దీక్ష చేశారు.

# జహీరాబాద్‌లో ఘనంగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు





**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:**
తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి కేసీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యురాలు సునీత లక్ష్మారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎన్నికల ఇంచార్జి దేవీప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రాణత్యాగాలకు సిద్ధమై ఉద్యమాన్ని విజయపథంలో నడిపారని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ అసాధ్యమని భావించిన సమయంలో ఉద్యమాన్ని ఆశగా మార్చిన మహానాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. జైలుశిక్షలు, నిర్బంధాలు, అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ నాయకత్వంలో సాగునీటి ప్రాజెక్టులు, రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. తెలంగాణ అంటే అభివృద్ధి, గౌరవం, ఆత్మవిశ్వాసం అని దేశానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలపై బీఆర్ఎస్ ఫిర్యాదు





**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నిర్వహణలో అధికారుల తీరుపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. చైర్‌పర్సన్ ఎన్నికను అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షరక్రమంలో పరిగణించకుండా, రాజకీయ పార్టీల అక్షరక్రమంలో నిర్వహించడం ద్వారా నిబంధనలు ఉల్లంఘించారని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎన్నికల ఇన్‌చార్జి దేవి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒక విధానం అమలవుతుండగా, జహీరాబాద్‌లో మాత్రం భిన్న విధానం అనుసరించడం అన్యాయమన్నారు. కౌన్సిలర్ అభ్యర్థుల పేర్ల ఆధారంగా ఎన్నిక నిర్వహించకుండా, రాజకీయ పార్టీ ప్రాతిపదికన కాంగ్రెస్‌కు అవకాశం కల్పించి చైర్మన్ పీఠం దక్కించుకునేలా పరోక్షంగా సహకరించారని విమర్శించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఇప్పటికే ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు పంపినట్లు తెలిపారు. రేపు స్వయంగా కలిసి వివరించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయానికి కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి వెళ్లిన ఎమ్మెల్యేను పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు సముదాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

## జహీరాబాద్ మూడో వార్డు అభివృద్ధికి కృషి చేస్తా

**- 9542 ఓట్ల మెజార్టీతో గెలిచిన కౌన్సిలర్ గంకటి శ్రీధర్ రెడ్డి కృతజ్ఞతలు...**



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఇటీవల నిర్వహించిన పురపాలక సంఘం ఎన్నికల్లో మూడో వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గంకటి శ్రీధర్ రెడ్డి 542 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పస్తపూర్ 3వ నెంబర్ వార్డు ఓటర్లకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి ఘన విజయం అందించిన ప్రతి ఓటరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి కౌన్సిలర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాట్లాడుతూ, ఈ గెలుపు తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తన తొలి కర్తవ్యం అని స్పష్టం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ సహకారంతో మూడో వార్డులో రహదారులు, కాల్వలు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. తన తండ్రి మాజీ సర్పంచ్ స్వర్గీయ ప్రతాప్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని శ్రీధర్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా మహమ్మద్ యూనుస్ విజయం

**- మ్యాజిక్ ఫిగర్ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు ఆధిక్యం....**

**- వైస్ చైర్మన్‌గా కొత్త కాపు శిరీష....**





**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. కోరమ్ లేక వాయిదా పడిన ఎన్నిక చివరకు మ్యాజిక్ ఫిగర్ రాజకీయాలతో ముగిసి కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. జహీరాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 37 వార్డులు ఉన్నాయి. బీఆర్ఎస్ 15, కాంగ్రెస్ 14, బీజేపీ 3, ఎంఐఎం 2, స్వతంత్రులు 3 స్థానాలు గెలుచుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ఎక్స్ ఆఫీసియో సభ్యులుగా నమోదు కావడంతో మొత్తం సభ్యుల సంఖ్య 39కి చేరింది. చైర్మన్ ఎన్నికకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 20 ఓట్లు కావడంతో రాజకీయ సమీకరణాలు ఉత్కంఠభరితంగా మారాయి. సోమవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో కోరమ్ లేక ఎన్నిక వాయిదా పడింది. మంగళవారం జరిగిన ఎన్నికలో బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు కలిసి ఎమ్మెల్యే కె. మాణిక్ రావు మద్దతుతో 19 మంది సభ్యులను కూడగట్టారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం ఇద్దరు సభ్యులు, ముగ్గురు స్వతంత్రులను తమవైపు తిప్పుకుని ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ మద్దతుతో మ్యాజిక్ ఫిగర్‌ను అందుకుంది. దీంతో 15వ వార్డు నుంచి ఎన్నికైన కాంగ్రెస్ కౌన్సిలర్ మహమ్మద్ యూనుస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 16వ వార్డు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచిన కొత్త కాపు శిరీష వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేసి నిధులు సాధిస్తామని తెలిపారు. చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ శిరీష మహిళల సంక్షేమం, పట్టణ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తానని తెలిపారు.

# కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి అభివృద్ధి దిశా నిర్దేశం

**- యువ పాలకమండలితో జహీరాబాద్ అభివృద్ధి వేగవంతం...**

**- మంత్రి మహ్మద్ అజారుద్దీన్...**







**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**
క్రికెట్ లో తన మొదటి మ్యాచ్ లో సెంచరీ చేసినట్లే, ఇక్కడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించి తనకు సెంచరీ చేసినట్లు గెలిపించారని మైనార్టీ మంత్రి మహమ్మద్ అజారొద్దీన్ అభివర్ణించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ ఉజ్వల్ రెడ్డి గెస్ట్ హౌస్‌లో మంగళవారం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ ఎండి. యునుస్, వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష, కౌన్సిలర్లను సన్మానించిన అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో స్థిరమైన అభివృద్ధి, సమగ్ర సంక్షేమం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.
రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులతో సమావేశమవుతూ నిధులు, ప్రాజెక్టుల కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. “అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు” అన్న సామెతను ఉదహరిస్తూ రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. జహీరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కొత్త పాలకమండలి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. తాను క్రికెట్‌లో ఎన్నో సెంచరీలు సాధించానని, ఇప్పుడు స్థానికులు సెంచరీ బాది కాంగ్రెస్‌కు ఘన విజయం అందించారని చమత్కరించారు.
ఎన్నికల ఇంచార్జి, రాష్ట్ర టీఎంఆర్ఈఐఎస్ చైర్మన్ ఫయ్యూమ్ ఖురేషీ మాట్లాడుతూ సీఎం ఆకాంక్ష మేరకు మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్ మున్సిపల్ పాలకమండలిలో యువ నాయకులు అధిక సంఖ్యలో ఉన్నారని, వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని ఎనిమిది మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం సంతోషకరమని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. మాజీ మంత్రి, నియోజకవర్గ ఇంచార్జి ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం గర్వకారణమన్నారు. గెలుపుకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు, సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్. ఉజ్వల్ రెడ్డి, తస్వీర్, ఆత్మ చైర్మన్ రామలింగారెడ్డి, సిడిసి చైర్మన్ ముభీన్, ఎంఐఎం ఇంచార్జి అత్తర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. నర్సింలు, పీ. నర్సింహారెడ్డి, హన్మంత్ రావు పాటిల్, బి. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పత్రికలపై సర్కారు వివక్షకు నిరసనగా

# కదం తొక్కిన కలం కార్మికులు

### సమాచార భవన్ భవన్ వద్ద జర్నలిస్టుల ఆందోళన





**హైదరాబాద్, వెలుతురు ఫిబ్రవరి 17:**
కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న,మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వకుండా, ఎంప్యానల్‌మెంట్ చేయకుండా వివక్ష చూపుతున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం ఆయా పత్రికల జర్నలిస్టులు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కార్యాలయం (సమాచార భవన్) ఎదుట ఆందోళన చేపట్టారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన “ఛలో సమాచార భవన్“ పిలుపు మేరకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన చిన్న, మధ్య తరహా పత్రికల నిర్వహకులు, పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీగా వెళ్లిన జర్నలిస్టులు దాదాపు రెండు గంటల పాటు కార్యాలయం ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు,చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్దతిని తుంగలో తోక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా...అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్ తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ...కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రిడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు తన్నీరు శ్రీనివాస్, కె. పాండురంగారావు, పద్మనాభరావు, యర్రమిల్లి రామారావు,హైదరాబాద్ జిల్లా నాయకులు వి.రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సంతోష్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్, నాయకులు డప్పు రామస్వామి,శంకర్, శివకుమార్,సంజీవ్ కుమార్, మంజులారెడ్డి, సౌభాగ్యవతి, సుష్మిత, శివపార్వతి, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరి ప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, నిజామాబాద్ జిల్లా నేతలు కుంచెం శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాస్, యార్వ నరేష్,మహాదేవ్ ప్రసాద్ రాజు, నల్గొండ జిల్లా నాయకులు వెలుతురు యాదయ్య, జీడిమట్ల రవీందర్, నాగయ్య, పరమేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ జగన్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు.

# నేటి రాజకీయ వ్యవస్థలో విశ్వాస సంక్షోభం సిద్ధాంత నిబద్ధత ఎక్కడ!



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం.

**ఓటు వేసే క్షణంలో ప్రజలు ఆశను అప్పగిస్తారు, గెలిచిన తరువాత అదే ఆశను పార్టీ మార్పుల పేరుతో వదిలేసే దృశ్యాలు నేటి రాజకీయ వ్యవస్థకు ప్రతీకగా మారాయి. ప్రజాస్వామ్యం అనేది అధికార మార్పిడికి మాత్రమే పరిమితం కాదనే సత్యం పాలకులకు మసకబారుతోంది. ఒకప్పుడు రాజకీయ జీవితం అంటే సిద్ధాంతానికి జీవితాంతం కట్టుబాటు అనే భావన ఉండేది. నేడు ఆ భావన స్థానంలో లెక్కలు, లాభాలు, అధికార సమీకరణలు నిలిచాయి. ఈ పరిణామమే ప్రజాస్వామ్యంలో తీవ్రమైన విశ్వాస సంక్షోభాన్ని సృష్టిస్తోంది.**

1950 నుంచి 1980 మధ్య కాలంలో భారత రాజకీయ వ్యవస్థకు స్పష్టమైన నైతిక పునాది ఉండేది. రాజకీయ నాయకత్వం సిద్ధాంతానికి బంధించబడిన జీవన ప్రయాణంగా భావించబడింది. జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్యం తరువాత దేశాన్ని నడిపించిన విధానం సిద్ధాంత నిబద్ధతకు ప్రతీకగా నిలిచింది. ఆయన రాజకీయ జీవితం మొత్తం ఒకే పార్టీ సిద్ధాంతానికి అంకితం అయింది. పదవులు కన్నా విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన నాయకత్వ శైలి అప్పటి రాజకీయ వాతావరణాన్ని నిర్వచించింది.
అలాగే అటల్ బిహారీ వాజపేయి తన రాజకీయ జీవితం మొత్తం ఒకే భావజాలానికి కట్టుబడి కొనసాగారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ సిద్ధాంతాన్ని వదలకుండా పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందారు. భారతీయ జనతా పార్టీ ఎదుగుదల వెనుక ఆయన నైతిక రాజకీయ శైలి ప్రధాన పాత్ర పోషించింది. ఎల్.కే. అద్వానీ రాజకీయ జీవితం కూడా దీర్ఘకాలిక సిద్ధాంత నిబద్ధతకు ఉదాహరణగా నిలుస్తుంది. పార్టీ బలోపేతం కోసం ప్రతిపక్ష పాత్రను స్వీకరించినా భావజాలాన్ని మార్చుకోలేదు. అధికారంలో లేకపోయినా సిద్ధాంత పోరాటాన్ని కొనసాగించడం అప్పటి రాజకీయ సంస్కృతికి సూచిక.
ఆర్థిక సంస్కరణల కాలంలో దేశాన్ని నడిపించిన పి.వి. నరసింహారావు రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించారు. తీవ్రమైన విమర్శలు ఎదురైనా పార్టీని విడిచిపెట్టకుండా దేశ ప్రయోజనాల దిశగా నిర్ణయాలు తీసుకున్నారు. సిద్ధాంతానికి లోబడి వాస్తవిక నిర్ణయాలు తీసుకోవడం అప్పటి రాజకీయ పరిపక్వతను చూపించింది.
సిద్ధాంత రాజకీయాలకు మరో ఉదాహరణగా చంద్రశేఖర్ పేరు నిలుస్తుంది. చిన్న కాలం ప్రధానమంత్రిగా ఉన్నా రాజకీయ జీవితమంతా తన భావజాలాన్ని నిలబెట్టుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. అధికారం కన్నా రాజకీయ స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చిన ధోరణి అప్పటి నాయకత్వ లక్షణం.
అదే విధంగా జార్జ్ ఫెర్నాండెజ్ కార్మిక వర్గ ఉద్యమాల నుంచి జాతీయ రాజకీయాల వరకు తన సిద్ధాంతాన్ని విడిచిపెట్టకుండా సాగారు. అధికార రాజకీయాల్లో ఉన్నా ప్రజా ఉద్యమ నేపథ్యాన్ని మరిచిపోలేదు. ఈ తరహా నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని బలంగా నిలిపింది.
కమ్యూనిస్టు రాజకీయ ధారలోనూ సిద్ధాంత నిబద్ధత ప్రధాన లక్షణంగా కనిపించింది. ఈ.ఎం.ఎస్. నంబూదిరిపాద్ వంటి నాయకులు అధికారంలో ఉన్నా సిద్ధాంత పరిమితులను దాటలేదు. కమ్యూనిస్టు పార్టీల్లో పార్టీ మార్పులు అరుదుగా ఉండడం అప్పటి రాజకీయ క్రమశిక్షణకు ఉదాహరణ.

ఆ కాలంలో నిర్వహించిన సర్వేల ప్రకారం సుమారు 72% ప్రజలు తమకు నచ్చిన పార్టీ పట్ల దీర్ఘకాలిక విశ్వాసం కలిగి ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ శాతం 78% వరకు ఉండేది. పట్టణ ప్రాంతాల్లో 65% నమోదు అయింది. యువతలో రాజకీయ వ్యవస్థపై నమ్మకం 68% వరకు ఉండేది. ఓటు వేయడం ఒక సిద్ధాంతానికి ఇచ్చే మద్దతుగా భావించబడింది.
1990ల తర్వాత రాజకీయ దృశ్యం మారింది. సంకీర్ణ రాజకీయాలు విస్తరించాయి. 1996 నుంచి 1999 మధ్య 3 సార్లు ప్రధానమంత్రి మారడం రాజకీయ అస్థిరతను సూచించింది. 2000 నుంచి 2010 మధ్య సుమారు 35% మంది శాసనసభ్యులు కనీసం ఒకసారి పార్టీ మారినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది రాజకీయ నిబద్ధత క్షీణతకు ప్రారంభ సంకేతంగా మారింది.
2014 తర్వాత పార్టీ మార్పులు మరింత సాధారణమయ్యాయి. 2014 నుంచి 2024 మధ్య దేశవ్యాప్తంగా సుమారు 42% మంది శాసనసభ్యులు ఒకసారి లేదా అంతకంటే ఎక్కువసార్లు పార్టీ మారారు. కొన్ని రాష్ట్రాల్లో ఈ శాతం 50 దాటింది. ప్రజలు ఓటు వేసిన పార్టీకి పాలన దక్కకపోవడం సాధారణ రాజకీయ దృశ్యంగా మారింది.
2025లో నిర్వహించిన సర్వే ప్రకారం రాజకీయ వ్యవస్థపై సంపూర్ణ నమ్మకం ఉన్నవారి శాతం కేవలం 38 మాత్రమే. 1990లో ఇదే శాతం 64 ఉండేది. 18 నుంచి 30 వయస్సు గల యువతలో రాజకీయ వ్యవస్థపై నమ్మకం 29 మాత్రమే. 40 పైబడిన వయస్సు గల వారిలో అది 44 వరకు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో విశ్వాసం 41 కాగా పట్టణ ప్రాంతాల్లో 34 మాత్రమే. మధ్యతరగతి వర్గంలో ఈ శాతం 31కి పడిపోయింది.
పార్టీ మార్పుల కారణంగా ఓటరు తన ఓటు విలువ కోల్పోయిన భావనకు లోనవుతున్నాడు. 2024లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం ఈ కారణంతో ప్రజల రాజకీయ విశ్వాసం సుమారు 15 వరకు తగ్గింది. యువతలో రాజకీయ నిరాసక్తత పెరుగుతోంది. 2009లో యువత ఓటింగ్ శాతం 58 కాగా 2019లో అది 52కి తగ్గింది. 2024లో అది సుమారు 49 నమోదు అయింది.
నేటి రాజకీయ వ్యవస్థలో వ్యక్తిగత లాభాలు ప్రధాన ప్రమాణంగా మారుతున్నాయి. 2020 నుంచి 2025 మధ్య జరిగిన రాజకీయ సంక్షోభాల్లో సుమారు 60 వరకు పార్టీ మార్పులే ప్రధాన కారణంగా గుర్తించబడ్డాయి. ప్రభుత్వ స్థిరత్వం దెబ్బతింటోంది. అభివృద్ధి కార్యక్రమాలపై దీర్ఘకాలిక ప్రభావం పడుతోంది. ప్రజాస్వామ్య భవిష్యత్తు రాజకీయ నాయకుల నిబద్ధతపై ఆధారపడి ఉంది. పార్టీ మార్పులపై కఠిన నియంత్రణ లేకపోతే ప్రజల విశ్వాసం మరింత తగ్గే ప్రమాదం ఉంది. యువతలో ప్రస్తుతం ఉన్న 29 విశ్వాసాన్ని కనీసం 55 వరకు పెంచడం సాధ్యమే.

సాధారణ ప్రజలలో ఉన్న 38 విశ్వాసాన్ని 5 సంవత్సరాల్లో 60కి తీసుకెళ్లడం కూడా సాధ్యమే. దీనికి నాయకత్వంలో నిజాయితీ అవసరం.
మొత్తంగా చూస్తే పూర్వకాల రాజకీయ వ్యవస్థ సిద్ధాంత నిబద్ధతకు ప్రతీకగా నిలిచింది. నేటి రాజకీయ వ్యవస్థలో ఆ నిబద్ధత తగ్గిపోయింది. పార్టీ మార్పులు ప్రజాస్వామ్య మూలాలను బలహీనపరుస్తున్నాయి. ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఆ ప్రాణాధారాన్ని కాపాడే బాధ్యత రాజకీయ నాయకులపై ఉంది. లేకపోతే ప్రజాస్వామ్యం ఎన్నికల ప్రక్రియగా మాత్రమే మిగిలిపోవడం ఖాయం.

**ప్రజాస్వామ్య విశ్వాస భవిష్యత్తు:**

ప్రజాస్వామ్య వ్యవస్థ అనేది ఒక కాలానికి పరిమితమైన రాజకీయ ఏర్పాటు కాదు; అది తరతరాల ప్రజల నమ్మకాలపై నిలబడిన దీర్ఘకాలిక ప్రక్రియ. ఈ ప్రక్రియను అర్థం చేసుకోవాలంటే నేటి పరిస్థితులను గతంతో పోల్చి చూడాల్సిన అవసరం ఉంది. 1950 నుంచి 1980 మధ్య కాలంలో భారత ప్రజాస్వామ్యం ప్రజల విశ్వాసంతో ముందుకు సాగింది. ఆ కాలంలో రాజకీయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం సుమారు 70% నుంచి 75% మధ్యలో ఉండేది. ఓటు వేయడం ప్రజలకు ఒక గౌరవంగా భావించబడేది. రాజకీయ నాయకత్వం అంటే సేవ, త్యాగం అనే భావన ప్రజల మనసుల్లో బలంగా ఉండేది.
1980 తర్వాత పరిస్థితులు క్రమంగా మారాయి. 1990 నాటికి రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకం సుమారు 64%గా నమోదైంది. ఈ దశలోనే రాజకీయాలలో అవకాశవాద ధోరణులు మొదలయ్యాయి. సంకీర్ణ రాజకీయాల ప్రవేశంతో పాటు పార్టీ మార్పులు కొంతమేరకు ఆమోదయోగ్యంగా మారాయి. అయినప్పటికీ ప్రజల విశ్వాసం పూర్తిగా క్షీణించలేదు. 1995 నాటికి కూడా గ్రామీణ ప్రాంతాలలో రాజకీయ వ్యవస్థపై నమ్మకం 68%గా ఉండేది. పట్టణ ప్రాంతాలలో అది 60% స్థాయిలో కొనసాగింది.
1996 నుంచి 1999 మధ్య జరిగిన రాజకీయ పరిణామాలు ప్రజల ఆలోచనల్లో కీలక మార్పును తీసుకొచ్చాయి. ఈ 3 సంవత్సరాలలో 3 సార్లు ప్రధానమంత్రి మారడం రాజకీయ అస్థిరతకు ప్రతీకగా నిలిచింది. ఈ దశలో ప్రజల నమ్మకం 64% నుంచి 55%కి తగ్గినట్లు కొన్ని సర్వేలు సూచించాయి. యువతలో రాజకీయాలపై విశ్వాసం 50% స్థాయికి దిగజారింది. అయినప్పటికీ ప్రజాస్వామ్యం పట్ల సంపూర్ణ నిరాశ అప్పటికి ఇంకా కనిపించలేదు.
2000 నుంచి 2010 మధ్య కాలాన్ని పరిశీలిస్తే పార్టీ మార్పులు మరింత పెరిగినట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఈ దశలో దేశవ్యాప్తంగా సుమారు 35% మంది శాసనసభ్యులు కనీసం ఒకసారి పార్టీ మారారు. 2004 నాటికి రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకం 52%కి తగ్గింది. పట్టణ యువతలో ఈ శాతం 45కి పడిపోయింది. గ్రామీణ ప్రాంతాలలో మాత్రం ఇంకా 58% వరకు నమ్మకం కొనసాగింది. ఇది గ్రామీణ సమాజంలో రాజకీయ సంప్రదాయాలు ఇంకా బలంగా ఉన్నాయనే విషయాన్ని సూచిస్తుంది.
2010 తర్వాత రాజకీయ వ్యవస్థ మరింత వేగంగా మారింది. 2014 ఎన్నికలు ఒక కీలక మలుపుగా నిలిచాయి. ఆ సమయంలో ప్రజలలో రాజకీయ వ్యవస్థపై ఆశలు పెరిగాయి. 2014లో ప్రజల నమ్మకం మళ్లీ 58% వరకు పెరిగినట్లు అంచనాలు సూచిస్తున్నాయి. యువతలో రాజకీయాలపై ఆసక్తి కూడా పెరిగింది. 18 నుంచి 30 వయస్సు గల యువతలో నమ్మకం 42% వరకు చేరింది. కానీ ఈ ఆశలు ఎక్కువ కాలం నిలవలేదు.
2014 నుంచి 2024 మధ్య జరిగిన రాజకీయ పరిణామాలు ప్రజల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ కాలంలో దేశవ్యాప్తంగా సుమారు 42% మంది శాసనసభ్యులు ఒకసారి లేదా అంతకంటే ఎక్కువసార్లు పార్టీ మారారు. కొన్ని రాష్ట్రాలలో ఈ శాతం 50 దాటింది. ఈ పరిణామాల ప్రభావంగా 2020 నాటికి రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకం 45%కి తగ్గింది. 2022 నాటికి అది 41%కి దిగజారింది. 2025లో నిర్వహించిన సర్వే ప్రకారం ఈ శాతం కేవలం 38 మాత్రమే.
యువత పరిస్థితి మరింత ఆందోళనకరం. 2009లో యువత ఓటింగ్ శాతం 58గా నమోదైంది. 2014లో అది 56గా కొనసాగింది. 2019లో అది 52కి తగ్గింది. 2024లో యువత ఓటింగ్ శాతం సుమారు 49గా నమోదైంది. ఈ గణాంకాలు యువతలో రాజకీయ నిరాసక్తత పెరుగుతున్నదానికి స్పష్టమైన సూచన. అదే సమయంలో యువతలో రాజకీయ వ్యవస్థపై సంపూర్ణ నమ్మకం ఉన్నవారు కేవలం 29% మాత్రమే ఉన్నారు. 1990లో ఇదే వర్గంలో నమ్మకం సుమారు 60%గా ఉండేది.
సామాన్య ప్రజలలో కూడా విశ్వాసం తగ్గింది. 2025 నాటికి గ్రామీణ ప్రాంతాలలో రాజకీయ వ్యవస్థపై నమ్మకం 41%గా ఉంది. పట్టణ ప్రాంతాలలో అది 34% మాత్రమే. మధ్యతరగతి వర్గంలో ఈ శాతం 31కి పడిపోయింది. కార్మిక వర్గాలలో మాత్రం ఇంకా 46% వరకు నమ్మకం కొనసాగుతోంది. ఇది ఆర్థిక అస్థిరత సమయంలో కూడా రాజకీయ వ్యవస్థపై ఆశలు పూర్తిగా చచ్చిపోలేదనే సంకేతంగా చూడవచ్చు.
పార్టీ మార్పుల ప్రభావం ప్రజల మనసుల్లో తీవ్రంగా పడింది. 2024లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం పార్టీ మార్పుల కారణంగా ప్రజల రాజకీయ విశ్వాసం సగటున 15% మేర తగ్గినట్లు అంచనా వేయబడింది. కొన్ని రాష్ట్రాలలో ఈ తగ్గుదల 20% వరకు నమోదైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్ల ప్రజల నమ్మకం మరో 10% మేర తగ్గిందని అదే అధ్యయనం పేర్కొంది. అంటే మొత్తం మీద ప్రజాస్వామ్య విశ్వాసం దాదాపు 25% మేర దెబ్బతిన్న పరిస్థితి ఏర్పడింది.
ఈ పరిణామాల ప్రభావం ప్రజాస్వామ్య భవిష్యత్తుపై తీవ్రంగా పడే అవకాశం ఉంది. రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకం 30% కంటే దిగజారితే ప్రజాస్వామ్య ప్రక్రియకు ప్రమాదం ఏర్పడుతుందని రాజకీయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 2026 నాటికి దేశవ్యాప్తంగా నమ్మకం 38% స్థాయిలో ఉండడం ఒక హెచ్చరికగా చూడాలి. ఈ శాతం 2030 నాటికి 30కి దిగజారితే ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల యంత్రాంగంగా మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉంది.
అయితే పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా ఉందని చెప్పలేం. సరైన సంస్కరణలు అమలులోకి వస్తే ప్రజల నమ్మకం మళ్లీ పెరిగే అవకాశాలు ఉన్నాయి. పార్టీ మార్పులపై కఠిన నిబంధనలు అమలైతే 5 సంవత్సరాలలో ప్రజల విశ్వాసం కనీసం 15% మేర పెరిగే అవకాశం ఉందని అంచనాలు సూచిస్తున్నాయి. అంటే 2026లో ఉన్న 38% నమ్మకం 2031 నాటికి 53% వరకు చేరవచ్చు.
యువతలో రాజకీయ అవగాహన పెంచే కార్యక్రమాలు అమలైతే యువత విశ్వాసం 29% నుంచి 55% వరకు పెరిగే అవకాశం ఉంది. విద్యా సంస్థలలో ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెరిగితే ఈ మార్పు సాధ్యం. గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికే ఉన్న 41% నమ్మకం 60% వరకు చేరవచ్చు. పట్టణ ప్రాంతాలలో ప్రస్తుతం ఉన్న 34% నమ్మకం 50% దాటే అవకాశం ఉంది.
ప్రజల భాగస్వామ్యం పెరగడం కూడా కీలకం. ప్రజలు కేవలం ఓటు వేసే వరకు మాత్రమే పరిమితం కాకుండా రాజకీయ ప్రక్రియను నిరంతరం పరిశీలిస్తే నాయకులపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ ఒత్తిడి వల్ల పాలనలో పారదర్శకత పెరుగుతుంది. పారదర్శకత పెరిగితే ప్రజల విశ్వాసం కూడా పెరుగుతుంది. 2020 నుంచి 2025 మధ్య పారదర్శక పాలన ఉన్న రాష్ట్రాలలో ప్రజల నమ్మకం సగటున 10% ఎక్కువగా ఉన్నట్లు కొన్ని అధ్యయనాలు సూచించాయి.
మీడియా పాత్రను కూడా విస్మరించలేం. ప్రజలకు సరైన సమాచారం అందినప్పుడు రాజకీయాలపై అవగాహన పెరుగుతుంది. అవగాహన పెరిగితే భావోద్వేగాల కంటే ఆలోచన ఆధారంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మార్పు దీర్ఘకాలంలో ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేస్తుంది. 2010 తర్వాత మీడియా విశ్వసనీయత తగ్గడంతో ప్రజల రాజకీయ అవగాహన కూడా ప్రభావితమైందని విశ్లేషణలు చెబుతున్నాయి. మీడియా విశ్వసనీయత 2010లో 62% ఉండగా 2025 నాటికి అది 44%కి పడిపోయింది. ఇది కూడా ప్రజాస్వామ్య విశ్వాసంపై ప్రభావం చూపింది.
భవిష్యత్తు దిశ స్పష్టంగా ఒక నిర్ణయాన్ని కోరుతోంది. రాజకీయ నాయకులు సిద్ధాంత నిబద్ధతను తిరిగి స్వీకరించాలి. పార్టీ మార్పులను రాజకీయ సంస్కృతిలో అపవాదంగా మార్చాలి. ప్రజల ఓటు విలువను గౌరవించే విధంగా వ్యవస్థను పునర్నిర్మించాలి. ఈ మార్పులు అమలైతే 2040 నాటికి ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం మళ్లీ 65% దాటే అవకాశం ఉంది. లేకపోతే అదే శాతం 25కి దిగజారే ప్రమాదం కూడా ఉంది. ముగింపుగా చెప్పాలంటే ప్రజాస్వామ్యం సంఖ్యల ఆట కాదు; కానీ సంఖ్యల ద్వారా దాని ఆరోగ్యం అర్థమవుతుంది. 1950లో 75%గా ఉన్న ప్రజల నమ్మకం 2025లో 38కి పడిపోయింది అంటే ఇది సాధారణ తగ్గుదల కాదు; ఇది ఒక వ్యవస్థాత్మక హెచ్చరిక. ఈ హెచ్చరికను రాజకీయ నాయకులు పట్టించుకోకపోతే ప్రజాస్వామ్యానికి తిరుగులేని నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రజల నమ్మకాన్ని కేంద్రంగా పెట్టుకొని రాజకీయ వ్యవస్థను మలచాలి. ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి శ్వాస. ఆ శ్వాస కొనసాగితేనే ప్రజాస్వామ్యం జీవించి ఉంటుంది. లేకపోతే అది కేవలం చట్టాల సమాహారంగా మాత్రమే మిగిలిపోతుంది.

# త్వరలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు?

- మంగళవారం రోజున అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కీలక భేటీ..
- ఒకే విడతలో పోలింగ్.. 15-20 రోజుల్లో ప్రక్రియ పూర్తికి కసరత్తు
- బడ్జెట్ సెషన్స్, పరీక్షల షెడ్యూల్‌కు తగ్గట్టుగా నిర్ణయం!



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:**
రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఉన్నతాధికారులతో నిర్వహించనున్న సమీక్షా సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ భేటీ తర్వాత ఎన్నికల నిర్వహణపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది. మున్సిపల్ ఎన్నికల జోష్‌తో అత్యంత వేగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది.కేవలం 15 నుంచి 20 రోజుల్లోనే మొత్తం ప్రక్రియను ముగించేలా ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నది. దీనివల్ల యంత్రాంగంపై భారం తగ్గడమే కాకుండా, త్వరగా పాలనపై దృష్టి పెట్టవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తున్నది.

**ఎన్నికల నిర్వహణపై చర్చ**

రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల నిర్వహణ సాధ్యసాధ్యాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. పరీక్షలకు ఆటంకం కలగకుండా పోలింగ్ తేదీలను ఎలా ఖరారు చేయాలనే అంశంపై విద్యాశాఖ, ఎన్నికల సంఘం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమాలోచన చేయనున్నారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఎన్నికల నిర్వహణ ఇప్పుడా? లేదా? పరీక్షల తర్వాత అనేది ఖరారు కానున్నది. ఇంటర్మీడియెట్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు జరగనున్నాయి. పదో తరగతి పరీక్షలు మార్చి 11 నుంచి ఏప్రిల్ 2 వరకు షెడ్యూల్ అయ్యాయి. అదే సమయంలో మార్చి రెండో వారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో మొత్తం 538 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. గత పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం ఈ స్థానాలన్నీ అధికారుల పాలనలో ఉన్నాయి. వీటిని త్వరగా మార్చిలోపు భర్తీ చేస్తే స్థానిక సంస్థలకు పెండింగ్‌లో ఉన్న 500 కోట్ల రూపాయలపైన 15 వ ఆర్థిక సంఘం నిధులను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నది.

# రేవంత్ ప్రజా పాలనకు జనగామలో ఘన విజయం

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారి అపార కృషి, వ్యూహాత్మక నాయకత్వానికి ప్రజల మద్దతు
- డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్


**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 17:**
జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం, ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారి ప్రజా పాలనపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఉన్న అచంచల నమ్మకానికి నిదర్శనమని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, క్లిష్ట పరిస్థితుల్లో కూడా కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడం ప్రజాస్వామ్య విలువల విజయమని అన్నారు. అధికారుల సమక్షంలో నిర్వహించిన డ్రాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీమతి కడకంచి బాలమణి గారి పేరు రావడం, ప్రజల ఆశీస్సులు కాంగ్రెస్ వైపు ఉన్నాయని స్పష్టం చేసిందని తెలిపారు. ఈ విజయానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ప్రజా కేంద్రిత పాలనతో పాటు, గౌరవ ఎంపీ శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారి అసాధారణ నాయకత్వం మరియు అహర్నిశలు చేసిన కృషి అని డా. రేఖ బోయలపల్లి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రారంభం నుండి చైర్మన్ ఎన్నిక వరకు ప్రతి దశను స్వయంగా పర్యవేక్షిస్తూ, కౌన్సిలర్లను సమన్వయం చేస్తూ, పార్టీ బలాన్ని కాపాడుతూ, కాంగ్రెస్ విజయాన్ని సాధించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్లు, అడ్డంకులు ఉన్నప్పటికీ, తన రాజకీయ దూరదృష్టి, వ్యూహాత్మక ఆలోచన, సంకల్పబలంతో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు నిజమైన ప్రజా నాయకుడిగా మరోసారి నిరూపించుకున్నారని తెలిపారు. జనగామ ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రజా పాలనకు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు మరియు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారి నాయకత్వానికి ప్రజలు ఇచ్చిన ఘన మద్దతని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనగామ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన శ్రీమతి కడకంచి బాలమణి గారికి, విజయం సాధించిన కౌన్సిలర్లకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మరియు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన ప్రజలకు డా. రేఖ బోయలపల్లి హృదయపూర్వక అభినందనలు మరియు ధన్యవాదాలు తెలిపారు.




# జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ విద్యార్థులు

- పరీక్ష కు హాజరైన 318 మంది విద్యార్థులు
- 100పర్సెంటైల్ పైగా సాధించిన 5గురు విద్యార్థులు
- 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించిన 28మంది విద్యార్థులు
- అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,ఫిబ్రవరి17 వెలుతురు:**
దేశవ్యాప్తంగా మొదటి విడతలో జరిగిన జెఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలో బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు 318 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో ఐదుగురు విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. మరో 28మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. బాలికల విభాగంలో ఏ. నిత్య (92.19) , సిహెచ్ గాయత్రి ( 91.50), ఎం. సహస్ర ( 87.69), పి. చరిత(86.20), ఎం. స్నేహ(85.09) పర్సంటైల్ సాధించారు. బాలుర విభాగంలో ఎం. నరేందర్(91.58), ఆర్ . కౌశిక్ (91.25), బి.మల్లేష్( 90.50), బి.హరీష్ (89.19), డి.రోహన్(88.05) పర్సంటైల్ సాధించారు. గతంలో రెండు సీఓఈ లలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు



కోచింగ్ ఇస్తుండగా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పది సీఓఈ లను ఏర్పాటు చేయడమే కాకుండా లాంగ్ టర్మ్ కోచింగ్ కూడా ఇస్తున్నదని ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థినీ, విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రి , బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ. శ్రీధర్ , ఐఎఎస్, ఎంజెపి సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ అభినందించారు.

# వారణాసిలో శివభక్తుడిగా కనిపిస్తా : ప్రకాశ్ రాజ్

భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ వరల్డ్ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు సినిమా విషయాలపై గోప్యత పాటించిన రాజమౌళి, ఇటీవల ఒక్కో అప్డేట్‌ను బయట పెడుతూ అభిమానుల్లో హైప్‌ను మరింత పెంచుతున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబు 'రుద్ర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తోంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' పాత్రలో కనిపించనున్నాడు. ఈ ముగ్గురు ప్రధాన పాత్రల ఫస్ట్ లుక్స్‌ను ఇప్పటికే చిత్రబృందం విడుదల చేయగా, టైటిల్ టీజర్ ద్వారా 'వారణాసి వరల్డ్' ఎలా ఉండబోతుందో ఒక విజువల్ శాంపిల్‌ను చూపించారు. ఓ హాలీవుడ్ ఇంటర్వ్యూలో రాజమౌళి సినిమా జానర్, కథ నేపథ్యంపై స్వల్ప హింట్స్ కూడా ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో రామాయణానికి సంబంధించిన ఓ ఎపిసోడ్ కూడా ఉండబోతుందని రాజమౌళి స్వయంగా వెల్లడించారు. కొన్ని నిమిషాల పాటు మహేష్ బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నట్లు తెలిపారు. ఆ ఎపిసోడ్ షూటింగ్ ఇప్పటికే



పూర్తయ్యిందని, ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయని సమాచారం. ఈ అంశం సినిమా మీద అంచనాలను మరింత పెంచింది. ఇక తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ ఈ సినిమాలో నటిస్తున్న విషయం కొంతకాలం క్రితమే వెల్లడించగా, ఇప్పుడు తన పాత్రను కూడా స్వయంగా బయటపెట్టారు. ఇటీవల ఓ న్యూస్ ఛానల్ డిబేట్‌లో పాల్గొన్న ఆయన, 'వారణాసి' చిత్రంలో తాను మహా శివభక్తుడి పాత్ర పోషిస్తున్నానని తెలిపారు. ఈ పాత్ర తన నటనా జీవితంలో మరో ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రకాశ్ రాజ్ గతంలో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'విక్రమార్కుడు' చిత్రంలో నటించారు. అలాగే మహేష్ బాబుతో 'రాజకుమారుడు' నుంచి 'గుంటూరు కారం' వరకు అనేక హిట్ చిత్రాల్లో కలిసి నటించారు. వీరిద్దరి కాంబినేషన్‌కు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆదరణ ఉంది. గతంలో 'ఢమరుకం' చిత్రంలో శివుడి పాత్రలో కనిపించిన ప్రకాశ్ రాజ్, ఇప్పుడు శివభక్తుడిగా నటించడం విశేషం. ప్రస్తుతం 'వారణాసి' తదుపరి షెడ్యూల్‌కు చిత్రబృందం సిద్ధమవుతోంది. విజువల్ గ్రాండియర్, మైథాలజీ ఎలిమెంట్స్, యాక్షన్ అడ్వెంచర్ మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సమ్మర్ సీజన్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అభిమానులు మాత్రం ఈ సినిమాను భారతీయ సినిమా గర్వంగా నిలిచే ప్రాజెక్ట్‌గా భావిస్తూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సేయాన్‌తో వస్తున్న శివకార్తికేయన్

కోలీవుడ్ సెన్సేషనల్ స్టార్ శివకార్తికేయన్ తన 26వ సినిమా అప్‌డేట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. గతేడాది 'అమరన్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న శివకార్తికేయన్– కమల్ హాసన్ కాంబో, ఇప్పుడు 'సేయోన్' అనే పవర్‌ఫుల్ ప్రాజెక్ట్‌తో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఫిబ్రవరి 16న ఈ చిత్ర టైటిల్‌తో ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా ఫస్ట్ గ్లింప్స్‌ను వదిలారు. ఫస్ట్ గ్లింప్స్‌లో శివకార్తికేయన్ సాంప్రదాయ ధోతీ, విభూతి మరియు రుద్రాక్షలతో కనిపిస్తూనే, చేతిలో కాగడా పట్టుకుని ఊగిపోతున్నట్లు కనిపిస్తున్నాడు. శివకార్తికేయన్ పాత్ర చూస్తుంటే.. ఈ సినిమా తమిళ దేవుడు మురుగన్ (సుబ్రహ్మణ్య స్వామి) అంశతో ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది. 'సేయోన్' అంటే రాజు అని అర్థం. మురుగన్‌ని తమిళంలో 'సేయోన్' అని కూడా పిలుస్తారు. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత బ్యానర్ 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' పై ఆర్. మహేంద్రన్ తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'అమరన్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరు కలిసి చేస్తున్న రెండో సినిమా కావడంతో ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన మొదటి చిత్రం 'తాయ్ కిళవి' విడుదలకు ముందే శివకార్తికేయన్ ఆయన ప్రతిభను గుర్తించి ఈ భారీ అవకాశం ఇచ్చినట్లు సమాచారం.




# సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నా


## 'హే భగవాన్' హీరోయిన్ శివాని నగరం

'ఇది సుహాస్‌తో నా రెండో సినిమా. కెరీర్‌లో నా మూడో సినిమా. ఇంతకు ముందు చేసిన సినిమాలో ఇంటెన్స్ క్యారెక్టర్ చేశాను. ఇందులో లైటర్ వెయిన్‌లో సాగే ఎంటర్‌టైన్‌మెంట్ పాత్ర. ఎంజాయ్‌చేస్తూ ఈ పాత్ర చేశా. వినోదంతోపాటు ఇందులో ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ కూడా బావుంటుంది' అని శివాని నగరం అన్నారు. సుహాస్‌కి జోడీగా ఆమె నటించిన చిత్రం 'హే బలవంత్'. 'హే భగవాన్' అనే టైటిల్‌తో రూపొందిన ఈ సినిమాను కొన్ని కారణాల దృష్ట్యా 'హే బలవంత్'గా మార్చారు. గోపీ అచ్చర దర్శకుడు. బి.నరేంద్రరెడ్డి నిర్మాత. బన్నీవాస్, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శివాని నగరం విలేకరులతో ముచ్చటించింది. 'వినగానే నచ్చిన కథ ఇది. వినోదంతోపాటు కలర్‌ఫుల్ విజువల్స్, మంచి మ్యూజిక్ కూడా ఇందులో ఉంది. నా పాత్ర, సుహాస్ పాత్ర, నరేష్, వెన్నెల కిశోర్ ఇలా అన్ని పాత్రలూ మిమ్మల్ని నవ్విస్తాయి. సుహాస్ మంచి నటుడు, ఫ్రెండ్లీ కూడా. ఇందులో మా కాంబినేషన్ సీన్స్‌ని ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. తెలుగు మాత్రమే కాక, ఇతర భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయని, సెలెక్టీవ్‌గా సినిమాలు చేస్తున్నాననీ, తమిళంలో రెండు సినిమాలు నిర్మాణ దశలో ఉన్నాయని, తెలుగులో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయని శివాని నగరం తెలిపారు.



# దురంధర్-2 మూవీకి ఆటకం


ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న 'ధురంధర్ 2' చిక్కుల్లో పడింది. ఈ సినిమా నిర్మాణ సంస్థ ముంబయిలో షూటింగ్ చేసుకోవడానికి వీల్లేదని దీనిపై బ్యాన్ విధించాలని బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ బ్యాన్ ప్రభావం షూటింగ్‌పై పడనుంది. ముంబయిలో చిత్రీకరణకు అనుమతి ఇవ్వాలని నిర్మాణ సంస్థ అప్లై చేసుకోగా.. దానికి మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు ఇవ్వలేదు. అంతేకాకుండా దీనిపై శాశ్వతంగా బ్యాన్ విధించాలని ప్రభుత్వాన్ని కోరింది. గతంలో షూటింగ్ నిర్వహించిన సమయంలో టీమ్ నిబంధనలను ఉల్లంఘించిందని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కార్పొరేషన్ వెల్లడించింది. ముంబయిలోని పలు వీధుల్లో ఇటీవల దీని షూటింగ్ జరిగిందని ఆ సమయంలో క్రాకర్లు, మండే పదార్థాలు ఉపయోగించారని అది షరతులను ఉల్లంఘించినట్లేనని అధికారులు పేర్కొన్నారు. ఆదిత్యధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన చిత్రం 'ధురంధర్'. గతేడాది చివర్లో విడుదలై సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్‌గా 'ధురంధర్:ది రివెంజ్' రానుంది. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




# స్టార్‌గా ఎదగడం మామూలు విషయం కాదు


## - నటి మృణాల్ ఠాకూర్

సినిమా ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి స్టార్‌గా ఎదగడం అంటే చిన్న విషయం కాదు. అందులోను ముఖ్యంగా హీరోయిన్ లకు.. ఎంత అందంగా ఉన్నప్పటికి స్టార్ డమ్ సంపాదించుకోవాలి అంటే తిప్పలు పడాల్సిందే. కొంత మందికి అదృష్టం బాగుండి అవకాశాలు వస్తాయి అందులో మృణాల్ ఠాకూర్ ఒకరు. తన అందం, అభినయంతో సౌత్ నార్త్ ప్రేక్షకులను మాయ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం ఆమె నటించిన లేటెస్ట్ మూవీ 'దో దీవానే షెహర్ మే' విడుదల సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా మృణాల్ తన కెరీర్ తొలినాళ్లలో పడ్డ కష్టాలను పంచుకుంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంచి పాత్రల కోసం దర్శకుల వెంట పడటంలో ఏమాత్రం తప్పు లేదని మృణాల్ స్పష్టం చేశారు.. 'మనం ఒక పాత్ర కోసం ఎంత ఆకలితో ఉన్నామో తెలిస్తేనే దర్శకుల ఆలోచనా విధానం మారుతుంది' అని ఆమె అభిప్రాయపడ్డారు. తన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' అవకాశం కూడా అలానే వచ్చిందని ఆమె వెల్లడించారు. దర్శకుడు రవి ఉద్యావర్ తెరకెక్కించిన 'మామ్' సినిమా చూసి ఫిదా అయిపోయిన మృణాల్, నేరుగా ఆయన్ని కలిసి.. 'సర్, మనం సినిమా ఎప్పుడు చేస్తున్నాం?' అని అడిగేశారట. ఆమెలోని ఆ ధైర్యమే నేడు ఈ భారీ ప్రాజెక్టులో అవకాశం తెచ్చిపెట్టింది. గతాన్ని గుర్తుచేసుకుంటూ.. 'మొదట్లో నాకు పని ఎలా అడగాలో కూడా తెలియదు. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్య ధర్ గారినే నేను మొదటిసారి అవకాశం అడిగాను. ఒక అవుట్‌సైడర్‌గా నా ముఖం వాళ్లకు కనిపించేలా చేసుకోవడానికి 'సర్, నేను ఇక్కడే ఉన్నాను.. నన్ను ఒకసారి కాస్ట్ చేయండి' అని బతిమిలాడేదాన్ని' అంటూ మృణాల్ ఎమోషనల్ అయ్యారు. సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి ఆమె నటించిన ఈ రొమాంటిక్ డ్రామా ఫిబ్రవరి 20న థియేటర్లలోకి రానుంది. అరేంజ్డ్ మ్యారేజ్ నేపథ్యంలో సాగే ఈ కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మృణాల్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# చెక్‌బౌన్స్ కేసులో అమీషా పటేల్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా క్లారిటీ

ఇప్పటికే చెక్‌బౌన్స్ కేసులో నటుడు రాజ్‌పాల్ యాదవ్ తిహార్ జైలులో ఉన్నాడు. అతడు బెయిల్ మీద జైలు నుంచి విడుదలయ్యేలోపే ఇప్పుడు మరో బాలీవుడ్ నటి వివాదంలో చిక్కుకుంది. ఒకప్పటి స్టార్ హీరోయిన్ అమీషా పటేల్‌పై చెక్ బౌన్స్ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. అయితే, ఈ అంశంపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా హీరోయిన్ క్లారిటీ ఇచ్చింది. 2017లో నవంబర్ 16న అమీషా పటేల్ మొరాదాబాద్‌లో ఒక పెళ్లి వేడుకలో డాన్స్ చేయాల్సింది.
ఇందుకుగాను అడ్వాన్స్‌గా నిర్వాహకుడు పవన్ వర్మ ఆమెకు రూ.14.5 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. ఆమె కోసం హోటల్ రూం, ఫ్లైట్ టిక్కెట్స్ కూడా బుక్ చేశాడు. అయితే, ఆమె ఈవెంట్‌కు హాజరు కాలేదు. దీంతో నిర్వాహకుడు తనకు జరిగిన నష్టానికి తిరిగి డబ్బులు చెల్లించాల్సిందిగా అమీషాను కోరాడు. దీంతో మధ్యవర్తుల ద్వారా ఇరు పార్టీల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఆమె అతడికి ఆ డబ్బు చెల్లించేందుకు అంగీకరించింది. మొదట రూ.10 లక్షలు నగదు రూపంలో చెల్లించింది. మిగతా రూ.4.5 లక్షలకు చెక్ ఇచ్చింది. కానీ, ఆ చెక్ బౌన్స్ కావడంతో నిర్వాహకుడు వర్మ తిరిగి అమీషాపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ అంశంలో ఇప్పటివరకు ఆమె కోర్టుకు హాజరుకాకపోవడంతో అమీషా పటేల్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.
దీనిపై అమీషా పటేల్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ఇది చాలా కాలం నాటి కేసు అని ఆమె పేర్కొన్నారు. పవన్ తనపై చేస్తున్న తప్పుడు ఆరోపణల్ని ఎదుర్కొనేందుకు తన న్యాయవాదుల బృందం ప్రయత్నిస్తోందని క్లారిటీ ఇచ్చారు. తను ఈ అంశంలో నిర్వాహకుడికి పూర్తి డబ్బు చెల్లించినట్లు పేర్కొన్నారు. అయితే, ఎవరి వాదనలో నిజం ఉందో మరికొంతకాలం తర్వాత తేలుతుంది.



### అసెంబ్లీకి హాజరుకావడం

# ఎమ్మెల్యేల విధి

**- అలా రానివారిని రీకాల్ చేయాల్సిందే**

**- ఏపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



**అమరావతి, ఫిబ్రవరి17( వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసెంబ్లీ లాబీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిట్‌చాట్ చేశారు. అయితే, విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలంటూ పిలుపునిచ్చారు.. అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి అని స్పష్టం చేశారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. కొందరు సభ్యులు సభకు హాజరుకాకుండానే జీతాభత్యాలు తీసుకుంటున్నారని.. సభకు హాజరుకాని సభ్యులకు జీతం కట్ చేయాలి కదా? అని ప్రశ్నించారు.. ఈ అంశాలన్నీ జాతీయ స్థాయిలో చర్చ చేపట్టామని? ఈ నిబంధన దాదాపు 8 దేశాల్లో అమల్లో ఉందన్నారు. ఇక, అసెంబ్లీలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పని చేస్తోందన్నారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. కాగా, తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. మొక్కుబడిగా.. అసెంబ్లీ ప్రారంభమైన తొలిరోజు హాజరై.. ఆ తర్వాత సమావేశాలకు దూరంగా ఉంటున్నారు.. మండలికి హాజరైన శాసన సభకు మాత్రం హాజరుకాకపోడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పలు సందర్భాల్లో ఎమ్మెల్యేల హాజరు విషయంపై చంలన వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే..

## అసోంలో కాంగ్రెస్‌కు బగ్ షాక్

**- మాజీ అధ్యక్షుడు భూపెన్ బోరా రాజీనామా**

**- బిజెపిలో చేరేందుకు రంగం సిద్ధం**



**గౌహతి,ఫిబ్రవరి17( వెలుతురు):**

అస్సాం ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. అస్సాం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భూపెన్ బోరా రాజీనామా రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ పరిణామం తర్వాత అస్సాం సీఎం, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మ, బోరాను వ్యక్తిగతంగా కలువనున్నట్లు ప్రకటించారు. బోరా రాజీనామాపై హిమంత మాట్లాడుతూ.. భూపెన్ బోరా అస్సాం కాంగ్రెస్ లో అట్టడుగు స్థానం నుంచి ఎదిగిన ప్రముఖ హిందూ నేత. ఆయన ఆహ్వానం మేరకు ఈ సాయంత్రం ఆయనను కలవనున్నాను. బీజేపీలో ఆయన చేరితే అస్సాం, దేశ సేవలో మరింత బలం చేకూరుతుందని అన్నారు. అస్సాం కాంగ్రెస్ చీఫ్‌గా గౌరవ్ గొగోయ్ బాధ్యతలు తీసుకునే ముందు 2021–25 వరకు అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోరా పనిచేశారు. ప్రస్తుతం, అస్సాం కాంగ్రెస్‌లో గొగోయ్ ఆధిపత్య ధోరణి కారణంగానే బోరా రాజీనామా చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. బోరా తన రాజీనామా లేఖను కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. 32 ఏళ్లగా పార్టీ కోసం పనిచేస్తున్నా, ఇప్పుడు విస్మరించారని, తనకు తగిన గౌరవం కల్పించలేదని ఆయన ఆరోపించారు. బోరా రాజీనామా ద్వారా కాంగ్రెస్‌లో సాధారణ వ్యక్తి అభివృద్ధి చెందలేదనే సందేశాన్ని పంపిందని, బోరాను బీజేపీలోకి స్వాగతిస్తున్నామని, బీజేపీలో చేరాలని నిర్ణయించుకుంటే ఆయనకు సురక్షిత స్థానం నుంచి ఎన్నికయ్యేలా చేస్తామని హిమంత చెప్పారు. సీఎం హిమంత తనను కలుస్తాననే వ్యాఖ్యలపై బోరా స్పందిస్తూ.. ఏ ముఖ్యమంత్రి అయినా తన ఇంటికి వస్తే అది తనకు గర్వకారణం అని బోరా అన్నారు. ఇదిలా ఉంటే, రాజీనామాపై పునరాలోచన చేయాలని గొగోయ్, ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్, దేబబ్రత సైకియాతో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు కోరారు.

## మొహాలిలో స్కూళ్లకు బాంబు బెదరింపులు

**- సిఎం మాన్ చికిత్స పొందుతున్న ఆసపత్రికి కూడా మెయిల్**

**- తనిఖీలు చేపట్టిన పోలీసులు**

**మొహాలీ,ఫిబ్రవరి17( వెలుతురు):**



పంజాబ్ మొహాలీలోని కొన్ని స్కూళ్లకు మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. వీటితోపాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ చికిత్స తీసుకుంటున్న ఫోర్టిస్ ఆసుపత్రికి కూడా మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనపై మొహాలీ సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ.. 'మొహాలీలో కొన్ని స్కూళ్లతోపాటు, ఫోర్టిస్ ఆసుపత్రికి కూడా బాంబు బెదిరింపులొచ్చాయి. వెంటనే బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టాము. బాంబు బెదిరింపులు రావడంతో.. ఫోర్టిస్ ఆసుపత్రిలో అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతున్నాయి. అత్యవసరం కానీ సేవల్ని నిలిపివేశాము. స్కూళ్లలో కూడా తనిఖీలు చేపట్టాము' అని ఆయన అన్నారు. ఃూగా, పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ ఫోర్టిస్ ఆసుపత్రిలో చికిత్స కోసం సోమవారం అడ్మిట్ అయ్యారు. సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన భగవంత్‌మాన్ కొద్ది గంటల తర్వాత ఆయాసంతో బాధపడుతూ మళ్లీ అడ్మిట్ అయ్యారు అని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 11న మొహాలీలో 16 ప్రైవేటు స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. పోలీసులు ఆ స్కూళ్లలో తనిఖీలు చేపట్టారు. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో చండీగఢ్, అమృతసర్, జలంధర్, పటియాలా, హర్యానాలో స్కూళ్లకు బాంబు బెదిరింపులొచ్చాయి.

# క్యాతన్‌పల్లిలో స్వల్ప ఉద్రిక్తత

**- బిఆర్ఎస్, కాంగ్రెస్ బాహాబాహీ**

**- పోలీసుల లాఠీచార్జ్...పలువురికి గాయాలు**



**మంచిర్యాల,ఫిబ్రవరి17( వెలుతురు):**

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో ఉద్రిక్తత నెలకొంది. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయానికి బీఆర్ఎస్, సీపీఐ అభ్యర్థులు భారీ బందోబస్తుతో చేరుకున్నారు. ఎంపీ వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థులు వచ్చారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్త ముదరడంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీ చార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయానికి బిఆర్ఎస్, సిపిఐ అభ్యర్థులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఎంపి వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థులు వచ్చారు. ఈ క్రమంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఘర్షణ రాజుకొని ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీ చార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లను చైర్మన్ ఎన్నికలో పాల్గొననివ్వకుండా పోలీసులు అక్రమ కేసులు పెట్టి అడ్డుకున్నారు. చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నికలో పాల్గొనేందుకు వెళుతున్న క్యాతనపల్లి మున్సిపాలిటీ 21వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ స్వర్ణలతను మంగళవారం పోలీసులు అడ్డుకున్నారు. ఆమెపై కేసు నమోదైందని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. దీంతో బాల్క సుమన్ మీద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాళ్ల దాడికి దిగారు. కాంగ్రెస్ దాడిని బిఆర్ఎస్ నాయకులు ప్రతిఘటించారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీ చార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు పోలీసులు, అధికారులను అడ్డం పెట్టుకుని మరోసారి కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠం దక్కించుకునేందుకు కుట్రలు పన్నిందని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

## మండలిలో డిజిటల్ అటెండెన్స్ ఎందుకు పెట్టలేదు ?

**- కల్తీ నెయ్యి వ్యవహారంలో ఇంకా అబద్దాల ప్రచారమేనా**

**- మీడియా పాయింట్ వద్ద విపక్షనేత బొత్స ఆగ్రహం**



**అమరావతి,ఫిబ్రవరి17( వెలుతురు):**

శాసనసభలో డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థను అమలు చేసిన ప్రభుత్వం, అదే విధానాన్ని శాసనమండలిలో ఎందుకు అమలు చేయడంలేదని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక, దేవదేవుడి ప్రసాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనవసర ఆరోపణలు చేశారని బొత్స ఆరోపించారు. పందికొవ్వు, జంతువుల కొవ్వు కలిపారని ప్రచారం చేయడం బాధాకరమన్నారు. వాస్తవాలు తేలాలని సుప్రీంకోర్టు సిట్ నియమించిందని, దర్యాప్తులో కొన్ని ఆశ్చర్యకర విషయాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. ప్రజలు జీర్ణించుకోలేని నిజాలు వెలుగులోకి వస్తున్నాయని వ్యాఖ్యానించారు.కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారనే కారణంతో ఇందాపూర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారని, ఇప్పుడు అదే సంస్థ రూ.680కు నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు. ఇందాపూర్ సంస్థకు హెరిటేజ్ ఫుడ్స్ సంబంధం ఉందని, ఇవన్నీ తాము సృష్టించిన ఆరోపణలు కాదని ? సంబంధిత సంస్థలే వెల్లడించాయని అన్నారు. ఇందాపూర్‌ను అడ్డుపెట్టుకుని హెరిటేజ్ దోపిడీకి ఎ÷–లాన్ చేసిందని, దేవుడి పేరుతో రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం చేశారని ఆరోపించారు. సభలో ఇందాపూర్ అంశంపై చర్చకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. టాయిలెట్లలో వాడే కెమికల్స్ లడ్డూలో కలిపారని సీఎం మాట్లాడటం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు అధికార దాహంతో ఏ స్థాయికైనా వెళ్తారని విమర్శించారు. ఆయన దోపిడీపై ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టం చేశారు.ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో బిల్ గేట్స్ పేరు కేంద్రం తొలగించిందనే వార్తలపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని, ఆ తర్వాత స్పందిస్తామని తెలిపారు. ఒకవేళ కేంద్రం ఆయన పేరును పక్కన పెట్టి ఉంటే, అదే సమయంలో ఏపీకి ఆహ్వానించడం సబబు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటింటికీ వైద్యం అందించామని, ఈ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని, రాజ్యాంగబద్ధమైన చర్యలు తీసుకోవాలంటే తీసుకోవచ్చుని పేర్కొన్నారు. మొత్తానికి, అసెంబ్లీలో అమలు చేస్తున్న డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని మండలిలో కూడా అమలు చేయాలని బొత్స సత్యనారాయణ గట్టిగా డిమాండ్ చేశారు.

# రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేలా బడ్జెట్

**- వ్యవసాయ రంగంలో సాంకేతికతకు పెద్దపీట**

**- బడ్జెట్‌పై చర్చలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



**అమరావతి,ఫిబ్రవరి17( వెలుతురు):**

రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేలా ఎపి బడ్జెట్ ఉందని శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ బ్జడెట్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేదిగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ బ్జడెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. మూలధన వ్యయాన్ని భారీగా పెంచడం ద్వారా ఆస్తులు సమకూరుతాయన్నారు. రెవెన్యూ లోటును తగ్గించడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తుపై నమ్మకం పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగాన్ని పెంచారని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు 50 వేల కోట్లకు పైగా కేటాయించడం ద్వారా ఇది నిజమైన రైతు ప్రభుత్వమని నిరూపించారని పుల్లారావు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు 6 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారని తెలిపారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించే చర్యలు తీసుకున్నారని, రైతు నష్టపోతే రాష్ట్రం నష్టపోతుందని ఆయన అన్నారు. ఎ÷ఖసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి రూ.91 వేల కోట్లు కేటాయించారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థికి రూ.15 వేలు అందిస్తున్నామని చెప్పారు. అత్యధిక సామాజిక భద్రత పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని అన్నారు. పరిశ్రమలు, ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యధిక పెట్టుబడులు సాధించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా బ్జడెట్ రూపొందించారన్నారు. అప్పుల చీకట్లో ఆశాదీపంగా వెలిగిన బ్జడెట్ ఇదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

## రాజస్థాన్‌లో భారీ అగ్నిప్రమాదం.. ఏడుగురు సజీవ దహనం

**భివాడి, ఫిబ్రవరి17( వెలుతురు):**

రాజస్థాన్ భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో ఘటనఫ్యాక్టరీ వస్త్రాల కర్మాగారంగా చలామణి అవుతూ అక్రమంగా బాణాసంచా తయారు చేస్తున్నారన్న జిల్లా అదనపు మెజిస్ట్రేట్ సుమిత్రా పారీక్ ఏడుగురు మృతిపై ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రగ్భ్రాంతిరాజస్థాన్ భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో నిన్న భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు ఫ్యాక్టరీలోనే చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. అకస్మాత్తుగా ఫ్యాక్టరీలో మంటలు చెలరేగగా.. కొద్ది సేపటికే భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న



ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేసి సహాయక చర్యలు చేపట్టారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ముందస్తుగా ఖాళీ చేయించారు. కాగా ప్రమాదంలో చిక్కుకున్న ఇద్దరు కార్మికులను రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఇక ఈ ఫ్యాక్టరీ వస్త్రాల కర్మాగారంగా చలామణి అవుతూ అక్రమంగా బాణాసంచా తయారు చేస్తున్నట్లు జిల్లా అదనపు మెజిస్ట్రేట్ సుమిత్రా పారీక్ వెల్లడించారు.

## మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలో అక్రమాలు

**- ఎన్నికల సంఘానికి బిఆర్ఎస్ ఫిర్యాదు**



**హైదరాబాద్,ఫిబ్రవరి17( వెలుతురు):**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దౌర్జన్యాలపై మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్ల దౌర్జన్యం, ఇబ్రహీం పట్నం ఎన్నిక స్టే అంశం పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..116 మున్సిపాలిటీ ,7 కార్పొరేషన్లలో ఎన్నికలు జరిగాయి. విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేసి, దాడులు చేశారని మండిపడ్డారు. ఎన్నికలు సజావుగా జరగలేదు. ఇవాళ చైర్మన్ ఎన్నికలో సైతం దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. జనగామలో మహిళా కౌన్సిలర్ చేయి పట్టి లాగారు. వాళ్లకు అనుకూలంగా ఉంటే అనౌన్స్ చేస్తున్నారు. లేదంటే దాడులు, వాయిదాలు వేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సంఘం పనితీరు నామ్ కే వాస్తేగా ఉంది. ఇబ్రహీంపట్నంలో ఎన్నిక అయ్యాక కోర్టు స్టే అని ఆపారు. దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. 30 మున్సిపాలిటీ లో హంగ్ వచ్చినా ఇష్టానుసారంగా ప్రవర్తించారు. పోలీసులను ఉపయోగించి వాళ్లకు అనుకూలంగా ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. గవర్నమెంట్ సంస్థలాగా ఎన్నికల సంఘం మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ధవలేశరం కొత్త గేట్లకు 150 కోట్లు విడుదల

**- జలవనరుల శాఖమంత్రి రామానాయుడు వెల్లడి**



**అమరావతి,ఫిబ్రవరి17( వెలుతురు):**

ధవలేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల దుస్థితిపై ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. నాడు బ్యారేజ్‌కు నిధులు ఇచ్చిన చంద్రబాబే.. మళ్లీ నేడు ధవలేశ్వరం బ్యారేజ్ కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాడైపోయిన గేట్లను తొలగించి కొత్త గేట్లను అమర్చ నున్నట్టు వెల్లడించారు. బ్యారేజ్‌లోని 117 గేట్లను తొలగించి వాటి స్థానంలో అధునాతనమైన కొత్త గేట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా గోదావరి జలాలు సమర్థవంతంగా నిల్వ ఉండి, డెల్టా ప్రాంత రైతులకు సాగునీటి సమస్యలు తగ్గుతాయని ఆయన తెలిపారు. ఈ సీజన్‌లోనే అన్ని పనులు పూర్తి చేసి, కొత్త గేట్లను పూర్తి స్థాయిలో అమర్చనున్నట్లు మంత్రి రామానాయుడు ప్రకటించారు. టెండర్లు, ఇతర చర్యలు వేగంగా పూర్తి చేసి త్వరితగతంగానే కొత్త గేట్లను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో 2014–19లో ధవలేశ్వరం గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని.. టీడీపీ ప్రభుత్వంలో 58 కొత్త గేట్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. తిరిగి ఇప్పుడు మిగిలిన 117 గేట్లను కూడా కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2019–24 మధ్య కాలంలో ధవలేశ్వరం గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని సీడబ్ల్యూసీ హెచ్చరించినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com